
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 29 జూన్ 2025

సండే స్పెషల్
SUNDAY SPECIAL

మహిళా శక్తి ఆర్థిక పరిపుష్టి



కొబ్బరిపీచుతో డోర్ మ్యాట్లు, తాళ్లు తయారు చేస్తున్న మధిరకు చెందిన అఖిల మహిళ సమాఖ్య సభ్యురాలు



- క్యాంటీన్లు మొదలు భవన నిర్మాణాల వరకు
- పూజా వత్తుల తయారీ నుంచి ఈవెంట్ మేనేజ్‌మెంట్ దాకా..
- అన్ని రంగాల్లో 'రాణి'స్తున్న వనితలు
- అమృత్‌మిత్రలుగా మొక్కల పెంపకం, తాగునీటి కుళాయిల నిర్మాణం
- చేయూతనిస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకం
- రాష్ట్రంలోనే జిల్లా మహిళ స్వయం సహాయక సంఘాల ముందంజ

6

కిరాణషాపులు.. టీ స్టాళ్లు.. కూరగాయల దుకాణాలే కాదు.. గృహ ఆధారిత, కుటీర పరిశ్రమలు, చేతి వృత్తుల కేంద్రాలు, అప్పడాలు, పచ్చళ్ల తయారీ.. బేకరీలు, హోటళ్లు, చేనేత పరిశ్రమల నిర్వహణలో మహిళలు దూసుకుపోతున్నారు. బ్యూటీ పార్లర్లు, కుట్టు పని కేంద్రాలు, డే కేర్ సెంటర్లతో ఆధునిక యువత కూడా తమ నైపుణ్యాలతో విజయబాటలో నిలుస్తోంది. ఇలా మహిళలు తమ స్వశక్తితో ఆర్థిక పరిపుష్టిని సాధించడంలో ప్రభుత్వం చేయూతనిస్తోంది. క్యాంటీన్లు, మహిళా మార్ట్ లాంటి వ్యాపారాలు మొదలు భవనాల నిర్మాణ పనుల వరకు.. పూజావత్తుల తయారీ నుంచి ఈవెంట్ మేనేజ్‌మెంట్ దాకా అన్నిటిలోనూ ఖమ్మం జిల్లా మహిళ స్వయం సహాయక సంఘాలు రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నాయి. మెప్మా నేతృత్వంలో బ్యాంకు రుణాల మంజూరు.. యూనిట్ల ఏర్పాటులో అధికారులు వారికి అండగా నిలుస్తున్నారు. వ్యాపార నిర్వహణ, చేతివృత్తులు, ఇతర ఉత్పత్తుల తయారీలో మెళకువలు, మార్కెటింగ్ వ్యూహాలపై వారికి వెన్నంటి ఉంటూ సలహాలు ఇస్తున్నారు. దీంతో ఇటు పట్టణ.. అటు గ్రామీణ మహిళలు ఆర్థిక స్వావలంబన వైపు అడుగులు వేస్తున్నారు.

- ఖమ్మం సంక్షేమ విభాగం

ఎరువులు, విత్తనాల అమ్మకాలు

పారదర్శకంగా జరగాలి

- ఈ-పాస్ మిషన్ ద్వారా విక్రయాలు నిర్వహించాలి
- వంద పడకల ఆస్పత్రితో ప్రజలకు మరిన్ని వైద్య సౌకర్యాలు
- ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక, మట్టి అందిస్తాం
- సత్తుపల్లి పర్యటనలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సత్తుపల్లిలోని వంద పడకల ఆస్పత్రి వద్ద సూచనలిస్తున్న కలెక్టర్ అనుదీప్

సత్తుపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, విత్తనాల అమ్మకాలు పారదర్శకంగా జరగాలని, అందుకు మ్యాన్యువల్ విధానంలో కాకుండా ఈ-పాస్ మిషన్ ద్వారానే అమ్మకాలు నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. శనివారం ఆయన సత్తుపల్లిలో ఆకస్మికంగా పర్యటించారు. తొలుత రూ.34కోట్లతో నిర్మితమవుతున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆయన ఆసుపత్రిలో యంత్ర, పరికరాలను సమకూరుస్తామని, వైద్యులు, సిబ్బంది త్వరలోనే రిక్రూట్‌మెంట్ చేసి ప్రజలకు మరిన్ని వైద్య సౌకర్యాలు అందిస్తామన్నారు. అదేవిధంగా రూ.25కోట్లతో నిర్మితమవుతున్న నర్సింగ్ కళాశాల భవనాన్ని పరిశీలించి పనుల్లో వేగంపెంచి నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సీమాంగ్ సెంటర్‌ను సందర్శించి మాతా శిశు సంరక్షణ, కాన్పులు, పిల్లల సంరక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో ఆయన సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. మందులు పంపిణీ, ఓపీ, ఇన్‌పేషంట్ వార్డు, డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. ఆ తర్వాత కాకర్లపల్లి రోడ్డులోని తెలంగాణ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి.. విత్తనాలు, ఎరువులు, మందుల లభ్యత గురించి తెలుసుకుని, ఏఏ విత్తనాలు ఎక్కువగా అమ్ముడవుతున్నాయి? రైతులు అడిగే రకాలు అందుబాటు ఉంచుతున్నారా లేదా? అని తెలుసుకున్నారు. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తుండటంతో రైతులు (మిగతా 6వ పేజీలో)

వానాకాలం సీజన్‌కు సంబంధించి ఇటీవల రైతులకు పెట్టుబడి సాయం అందించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పుడు భూమి లేని వ్యవసాయ కూలీలకు ఆర్థిక సాయం అందించే అంశంపై దృష్టి పెట్టింది. ఈ ఏడాది జనవరిలో ప్రారంభించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించిన తొలి విడత చెల్లింపులు పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఒక్కో లబ్ధిదారుడికి ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం రూ.6వేల చొప్పున రెండు విడతల్లో అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఉపాధి హామీ కూలీల్లో ఇందిరమ్మ ఆత్మీయభరోసాపై ఆశలు చిగురించాయి. ఇప్పటికే గడిచిన సీజన్‌లో ఉపాధి పథకంలో పనిచేసే వారి ఆధార్‌ను అనుసంధానం చేశారు.



'ఆత్మీయ భరోసా'పై ఆశలు

- వారం రోజుల్లో అందించేందుకు సర్కారు కసరత్తు
- ఎదురుచూస్తున్న భూమిలేని వ్యవసాయ కూలీలు
- ఈ సారి ఉపాధి కూలీలకూ దక్కనున్న ప్రయోజనం

ఖమ్మం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలో ఉపాధి హామీ కూలీలు అధికసంఖ్యలోనే ఉన్నారు. మొదటి విడతలో 2023-24లో 20రోజులపాటు పనిచేసిన కుటుంబాలకు మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయయభరోసా లభించింది. అయితే ఈసారి మళ్లీ ఈపథకం కింద వ్యవసాయకూలీలకు ఇందిరమ్మ ఆత్మీయభరోసా అందించేందుకు ప్రభుత్వం కార్యచరణ సిద్ధం చేస్తోంది. దీంతో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనుల్లో పాల్గొన్న కూలీలకు ఎక్కువ సంఖ్యలోనే ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

ఖమ్మం జిల్లా పరిధిలో 2.18లక్షల మందికిపైగా జాబ్ కార్డులున్నాయి. ఇందులో లక్షా 20వేల మందికిపైగా ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. ఇందులో సుమారు 67వేల మంది పూర్తిస్థాయిలో పనుల్లో హాజరవుతూ వస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద మండలానికి ఒక్క గ్రామంలో కొన్ని కుటుంబాలకు మంజూరు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2.32లక్షల జాబ్‌కార్డులుండగా లక్ష30వేల మంది ఉపాధి పనులకు హాజరయ్యారు. సుమారు 75వేలపైగా పూర్తిస్థాయిలో పనులకు హాజరయ్యారు. గతేడాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మోడల్ గ్రామాల్లో అర్హత ఉన్న వ్యవసాయ కుటుంబాలకు రూ.6వేల చొప్పున అందించారు. ఇందులో ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పూర్తిస్థాయి ఉపాధి పనుల్లో పాల్గొని మిగిలిన సమయంలో వ్యవసాయ పనుల్లో పాల్గొన్న వారికి ఇందిరమ్మ ఆత్మీయభరోసా అందనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఉమ్మడిజిల్లాలో రైతుభరోసా కింద పెట్టుబడి అందించింది. ఖమ్మంజిల్లాలో 3.53లక్షల మందిపైగా రైతులకు రూ.436.85కోట్లు మంజూరు చేయగా.. 3.38లక్షల రైతులకు రూ.428కోట్లు ఖాతాల్లో జమయ్యాయి. భద్రాద్రి జిల్లాలో లక్షా88వేల మంది రైతులకు రూ.332.98కోట్లు మంజూరుచేయగా లక్షా 77వేల మంది ఖాతాల్లో రూ.317.16కోట్లు జమచేశారు. మిగిలిన వారికి కూడా సొమ్ములు జమవుతున్నాయి. రైతుల్లో కొత్త (మిగతా 6వ పేజీలో)

పాలేరుకు

ఏటీసీ సెంటర్

- మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- యువతలో వృత్తి నైపుణ్యాల పెంపునకు అవకాశం
- తిరుమలాయపాలెం మండలంలో ఏర్పాటు

కూసుమంచి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) నూతనంగా మంజూరైంది. ఈ సెంటర్‌ను తిరుమలాయపాలెం మండలంలో ఏర్పాటుకు ప్రభుత్వం జీవో నెంబర్ 8ని జారీ చేసింది. యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా.. ఉపాధి కల్పన, శిక్షణశాఖ అధ్వర్యంలో నియోజకవర్గాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుచేయాలని సంకల్పించింది. ఇందుకు రూ.45కోట్లు మంజూరు చూసింది. ఇందుకు అవసరమైన అనువైన స్థలాన్ని గుర్తిస్తూ సమగ్ర వివరాలతో నివేదిక అందజేయాలని జిల్లా అధికారులను ఆదేశించింది. రోడ్డు రవాణా వసతితో పాటు, సమీపంలో పరిశ్రమలు ఉన్న స్థలాలను ఎంపికచేస్తే ఏటీసీ కేంద్రానికి విద్యార్థుల ప్రవేశాలు పొందేందుకు, ఇన్‌స్ట్రక్టర్లు సులువుగా ప్రయాణించేందుకు వీలుంటుందని సూచించారు. శిక్షణ పూర్తిచేసుకున్న వెంటనే యువతకు ఉపాధి అవకాశాలు లభించేందుకు దోహదపడుతుంది. ఈ సందర్భంగా ఏటీసీ మంజూరు కావడం పట్ల నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా సెంటర్‌ను మంజూరు చేయించిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి స్థానికులు, యువత కృతజ్ఞతలు తెలిపారు.

భద్రాద్రిలో పీజీ వైద్య కళాశాల

- యూజీ లేకుండా పీజీ ఏర్పాటుకు నిర్ణయం
- రాష్ట్రంలో ఐదు వైద్యశాలలు బోధనాస్పత్రులుగా మార్పు



భద్రాచలం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదు పీజీ వైద్యశాలల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇప్పటి వరకు యూజీ వైద్యకళాశాల ఉన్న చోటనే పీజీ కోర్సులను నిర్వహించారు. కానీ రాష్ట్రంలో ఈ ఏడాది నుంచి నేరుగా పీజీ వైద్య కళాశాలలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఇందుకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) వెసులుబాటు కల్పించడంతో యూజీ లేకుండానే పీజీ కళాశాల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రాష్ట్రంలో కింగ్‌కోఠి, పెద్దపల్లి, బాన్సువాడ, భద్రాచలం, మిర్యాలగూడెం ప్రాంతాల్లో యూజీ లేకుండానే పీజీ వైద్య కళాశాల ఏర్పాటు చేపట్టనున్నారు. ఏజెన్సీ డివిజన్ కేంద్రమైన భద్రాచలంలో ఇప్పటికే ప్రభుత్వ ఏరియా వైద్యశాల 200పడకలు ఉండటంతో ఇక్కడ పీజీ కళాశాల ఏర్పాటు చేయనున్నట్టు తెలుస్తోంది. ఇటీవల ఎన్ఎంసీ చైర్మన్ డాక్టర్ గంగాధర్ హైదరాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ సైతం పీజీ కళాశాలల ఏర్పాటుకు అనుమతివ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో ఎన్ఎంసీ నుంచి పీజీ మెడికల్ కళాశాలల ఏర్పాటుకు మార్గం సుగమం కావడంతో భద్రాచలంలో పీజీ కళాశాల ఏర్పాటు కానుంది. ఇదిలా ఉండగా ఆరు దశాబ్దాలకు పైగా భద్రాచలం వైద్యశాల ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఏజెన్సీ వాసులకు సేవలందుతున్నాయి. తెలంగాణ ఆవిర్భావం అనంతరం కూడా ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల ప్రజలకు ఇక్కడ నిరంతరం వైద్య సేవలు అందుతున్నాయి. అంతా అనుకున్నట్టు జరిగితే భద్రాచలంలో పీజీ కళాశాల ఏర్పాటుతో ఏజెన్సీ వాసులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్యం అందడంతో పాటు వైద్యుల కొరత తీరనుంది.



బాలింతలతో వైద్యులు, సిబ్బంది

4 గంటలు... 14 డెలివరీలు..

- ఎనిమిది మందికి సాధారణ కాన్పులు
- ఖమ్మం జిల్లా ఆస్పత్రి వైద్యుల ఘనత

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):నాలుగు గంటల్లో 14కాన్పులు చేసి రికార్డు సృష్టించారు ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రి వైద్యులు. ఇక్కడి మాతా శిశు సంరక్షణ కేంద్రంలో శనివారం ఉదయం 8.30 గంటలనుంచి మధ్యాహ్నం 1గంటలోపు 14 కాన్పులు చేశారు. వీటిలో సాధారణ కాన్పులు 8, ఒకటి క్రిటికల్, మిగిలినవి సీ సెక్షన్ ద్వారా కాన్పులను చేశారు. ఈ కాన్పుల్లో ఐదుగురు మగపిల్లలు, 9 మంది ఆడపిల్లలు జన్మించారు. వారితో పాటు తల్లులంతా క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. గైనకాలజిస్ట్ హెచ్‌వోడీ డాక్టర్ యామిని ఆధ్వర్యంలో వైద్యులు డాక్టర్ రిక్షిత, డాక్టర్ దివ్య హెడ్‌నర్స్ వరలక్ష్మి, సీనియర్ మిడ్వైఫ్ మాధురి, ఉమారాణి, సునీత పాల్గొన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో గర్భిణుల నమోదుతో పాటు వారికి 9నెలల పాటు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తల్లీ పిల్లల సంరక్షణ కోసం మిడ్వైఫరీ సేవలు ఆస్పత్రిలో విస్తృతంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సాధారణ కాన్పులు నిర్వహించేందుకు మిడ్వైఫరీ ఆధ్వర్యంలో పలు పద్ధతులను నిర్వహిస్తున్నట్టు వీటిని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ యామిని కోరారు.

మహిళా శక్తి.. ఆర్థిక పరిపుష్టి

- క్యాంటీన్లు మొదలు భవన కట్టడాల వరకు
- పూజావస్తువుల తయారీ నుంచి ఈవెంట్ మేనేజ్‌మెంట్ దాకా..
- అన్ని రంగాల్లో 'రాణి'స్తున్న పట్టణ వనితలు
- అమృత్‌మిత్రలుగా మొక్కల పెంపకం, తాగునీటి కుళాయిల నిర్మాణం
- ప్రభుత్వ తోడ్పాటుతో ఆర్థిక స్వావలంబనలో నిరుపేద మహిళలు
- చేయూతనిస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకం
- రాష్ట్రంలోనే జిల్లా మహిళా స్వయం సహాయక సంఘాల ముందంజ

సండే స్పెషల్ SUNDAY SPECIAL

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకంతో ఇటు పట్టణ.. అటు గ్రామీణ మహిళలు స్వశక్తితే ముందుకు సాగుతూ ఆర్థిక పరిపుష్టిని పొందుతున్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లా మహిళాసంఘాలు రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉన్నాయి. క్యాంటీన్ల నిర్వహణ నుంచి ప్రభుత్వ పాఠశాలల భవనాల నిర్మాణాల వరకు, పూజావస్తువుల తయారీ నుంచి ఈవెంట్ల నిర్వహణ వరకు పలు రంగాల్లో మహిళ సంఘాలు ఆదర్శంగా నిలుస్తుండటంతో పాటు వారి కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటును కల్పిస్తున్నాయి. ఖమ్మం మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ అభిషేక్ అగస్త్య, డీఎంసీ సావల సుజాత పర్యవేక్షణలో యూనిట్లు నెలకొల్పేందుకు బ్యాంకుల ద్వారా రుణాలను సమకూరుస్తున్నారు. అలాగే నేటి యువతలో నైపుణ్యాలను గుర్తించి ఉపాధి కల్పించేందుకు పలు రంగాల్లో నైపుణ్య శిక్షణనిస్తూ.. సొంతంగా వ్యాపారం నిర్వహించుకునేలా మెళకువలు, మార్కెటింగ్ వ్యూహాలను వివరిస్తున్నారు. మహిళ ఉత్పత్తులను నేరుగా అమ్మకాలు జరిపేందుకు గాను రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా ఖమ్మంలో మహిళా మార్టును అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో గతంలో కంటే ఎక్కువ సమయాన్ని మహిళలు ఉత్పత్తులపై కేటాయిస్తున్నారు. అలాగే ఇందిరా మహిళా శక్తి పథకం కింద వ్యవసాయ అనుబంధం, వ్యవసాయేతర రంగాలుగా విభజించి రుణాలిస్తున్నారు. ఈక్రమంలో ఖమ్మం జిల్లాలో 2,400మహిళా సంఘాల సభ్యులకు రూ.310కోట్లతో ఆర్థిక తోడ్పాటు అందించారు. వీరితో 602 ఇందిరా మహిళ శక్తి యూనిట్లు, 109 గ్రూప్ యూనిట్లు, 5 కుట్టు మిషన్ కేంద్రాలు, ఉమెన్ ఫర్ వాటర్ కేంద్రాలు 6 సంఘాలు, ఉమెన్స్ ఫర్ ట్రీస్ 7సంఘాలు, 57 వీధి వ్యాపారుల సంఘాలు, 3 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా చేయూతనిచ్చారు.

- వ్యవసాయ అనుబంధంగా పాల ఉత్పత్తి కేంద్రాలు, మొబైల్ చేపల యూనిట్లు, పాడిగేదెలు, నాటు కోళ్ల పెంపకం, ఆహార శుద్ధి పరిశ్రమలు, వ్యవసాయ పనిముట్ల అద్దె కేంద్రం, ఫుడ్‌పార్కులను మంజూరు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 3,234 యూనిట్లు లక్ష్యం కాగా 2,519 యూనిట్లు ఏర్పాటుకు కార్యచరణ చేశారు. 17 యూనిట్ల గ్రౌండింగ్ పూర్తి చేశారు.
- వ్యవసాయేతర రంగాల విభాగంలో మీ సేవా కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వాహణ కేంద్రాలు, ఈవెంట్స్ మెనేజ్‌మెంట్స్, మైక్రో ఎంట్రప్రైజెస్, కుట్టుమిషన్ల యూనిట్లు మంజూరు చేస్తారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 3,135 యూనిట్లు రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా మంజూరు చేసింది. వీటిలో ఇప్పటికే 330యూనిట్లు గ్రౌండింగ్ పూర్తయ్యాయి. మరో 1,366 యూనిట్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

వీధి వ్యాపారులుగా..

ఉపాధి కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతలకు వచ్చిన కుటుంబాల్లోని మహిళలు రహదారుల వెంట చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్నారు. అలాంటి వారిని గుర్తించి ఇందిరా మహిళా శక్తి పథకంపై అవగాహన కల్పించి వీధి వ్యాపారులుగా గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేసింది. మెప్మా ద్వారా ఖమ్మంలో 60, మధిర 8, సత్తుపల్లి 9, వైరాలో 12 వీధి వ్యాపార సంఘాలకు ఉపాధి కల్పించారు.

పూజా వత్తులుతో..

పూజా వత్తుల తయారీతోనూ మహిళ స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక తోడ్పాటు అందుతోంది. మెప్మా ఆధ్వర్యంలో రుణాలను మంజూరు చేయించి యంత్రాలను ఇవ్వగా ప్రియదర్శిని, పద్మావతి స్వయం సహాయక సంఘాల్లోని 40 మంది మహిళలు పూజా వత్తులు, ఇతర సామగ్రిని తయారు చేస్తున్నారు.

కుట్టు పనులతో..

ప్రభుత్వ పాఠశాలల నుంచి సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల వరకు ప్రభుత్వం నిర్ణయించిన యూనిఫాంను మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా కుట్టిస్తున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలోని సెర్ప్ ద్వారా 20మండలాల్లో 77 మహిళా కుట్టు మిషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 583 మంది మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఖమ్మం, సత్తుపల్లి, వైరా, మధిర మున్సిపాలిటీల్లోని సర్కారు విద్యార్థులకు అవసరమైన సింగిల్ యూనిఫాం తయారీ అవకాశమిచ్చారు. ఖమ్మంలోని మహాత్మాగాంధీ టీఎల్ఎఫ్ ద్వారా 10,942, సత్తుపల్లి ప్రియదర్శిని టీఎల్ఎఫ్ ద్వారా 1,685, మధిర సరస్వతి టీఎల్ఎఫ్ ద్వారా 1,600, వైరా మదర్‌థెరిస్సా టీఎల్ఎఫ్ ద్వారా 1,591 యూనిఫాంలను కుట్టించి పంపిణీ చేపట్టారు. గత ప్రభుత్వం ఒక్కో జతకు రూ.50 మాత్రమే ఇవ్వగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్కో జతకు రూ.75 అందించారు. వేసవిలో ఈ యూనిఫాం తయారీ ద్వారా ఒక్కో మహిళా రోజుకు రూ.350 నుంచి రూ.400 వరకు పొందారు.

నిర్మాణ రంగంలోకి...

ప్రభుత్వ పాఠశాలల నిర్మాణంలోనూ మహిళా స్వయం సహాయక సంఘాలు ముందున్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల భవనాలు నిర్మాణంలో ముందుకొచ్చాయి. 75 పాఠశాలల్లో 70 పాఠశాలల్లో నిర్మాణాలు జరిపారు. 500మంది మహిళలకు ఆర్థిక తోడ్పాటు జరిగింది. పాఠశాలల భవనాలు నాణ్యంగా నిర్మాణాలు జరిగాయని కితాబు పొందారు.



కొబ్బరి పీచు నుంచి మ్యాట్లు..

కొబ్బరి ఇతర పీచు వ్యర్థాల నుంచి తాళ్లు, మ్యాట్లను తయారు చేస్తూ మధిర మున్సిపాలిటీలోని మహిళ స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా ఉపాధి పొందుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 150మందికి పైగా మహిళలు మ్యాట్, ఇతర ఉత్పత్తులను పొందుతూ ఆర్థిక స్వావలంబన సాగిస్తున్నారు.



వస్త్రాలపై అందాలను అద్దుతూ..

సత్తుపల్లిలోని శ్రీఅంజనేయ మహిళ స్వయం సహాయక సంఘం సభ్యులు వస్త్రాలపై అందమైన రంగులు, బొమ్మలను అద్దుతూ ఆర్థికంగా లాభాలు పొందుతున్నారు. 50మందికి పైగా మహిళలు ఉపాధిని పొందుతున్నారు.

అమృత్‌మిత్రలుగా..

'నీటి కోసం మహిళ.. మహిళ కోసం నీరు' అనే నినాదంతో రాష్ట్రంలోని 8 నగరపాలక సంస్థలతోపాటు ఖమ్మంలో అమృత్ మిత్రలకు అనుమతిచ్చి ప్రత్యేకంగా రూ.60లక్షలను అమృత మిత్ర పథకాలకు కేటాయించింది. దీంతో ఖమ్మం నగరంలో మొత్తం 18వాటర్ ట్యాంకుల్లోని ఆరు ప్రధాన తాగునీటి పంపిణీ ట్యాంకుల నిర్వహణ బాధ్యతలను ఉప్పలమ్మ తల్లి,లిల్లీ, ఉషశ్రీ, తిరుమల, ప్రియదర్శిని, ముద్దమందారం మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. ఆయా సంఘాల్లోని మహిళలు గుట్టల బజార్, ఖైకొండాయిగూడెం, బాలపేట, రోటరీనగర్, శ్రీరామ్ హిల్స్ ఎస్పీ ఆఫీస్‌రోడ్డు వాటర్ ట్యాంకులను నిర్వహిస్తారు. అమృత్ మిత్రలతో ఆయా కనెక్షన్ల వివరాలను ఆన్‌లైన్ చేయిస్తున్నారు. ఒక్కోపంపు ఆన్‌లైన్‌కు రూ.100 ప్రోత్సాహకం అందుతోంది.

ఈవెంట్ మెనేజ్‌మెంట్‌లోను..

పలు కార్యక్రమాల నిర్వహణకు గాను ఈవెంట్ మెనేజ్‌మెంట్ విభాగంలో మహిళ స్వయం సహాయక సంఘాలు గుర్తింపు పొందాయి. ఖమ్మంలోని గాంధీ, శ్రీరామసమైఖ్య, ఆర్ధ నారీశ్వరి, లక్ష్మీరాజేశ్వరి, కావ్య మహిళ స్వయం సహాయక సంఘాలు ప్రత్యేకతను చాటుతున్నాయి. పుట్టిన రోజు వేడుకల నుంచి వివాహాల వరకు ఈవెంట్స్‌తో పాటు ఫొటో, వీడియో రంగాల్లోను ముందుంటున్నాయి. 150మందికి పైగా ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

ఉమెన్స్ ఫర్ ట్రీస్‌లో..



పట్టణ ప్రాంతాల్లోని నిరుపేదలైన మహిళలకు ఉపాధి కల్పించేందుకు ఉమెన్స్ ఫర్ ట్రీస్ కార్యక్రమాన్ని రూపొందించారు. ఖమ్మం, సత్తుపల్లి, మధిర, వైరాలో 9 మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా మొత్తం 68మంది మహిళలకు మూడేళ్ల పాటు ఉపాధి దక్కింది. మొక్కలను నాటి మూడేళ్ల పాటు సంరక్షణ చేయాల్సి ఉంటుంది. ఇలా నిర్వహించినందుకు ఆయా అమృత్‌మిత్రాలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణీత మొత్తాన్ని ఇస్తోంది.

రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా ట్రాన్స్‌జెండర్లకు రుణాలు



సమాజంలో ట్రాంజెండర్లకు సరైన గౌరవంతో పాటుగా ఉపాధి కల్పించేలా ఖమ్మం జిల్లాలోని ట్రాంజెండర్లకు మెప్మా ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా ట్రాంజెండర్ సంఘాలను ఏర్పాటు చేస్తున్నారు. ఖమ్మం, సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల పరిధిలోని మెప్మా ఆధ్వర్యంలో ఆర్పీలు ఇంటింటి సర్వే నిర్వహించగా ఖమ్మంలో 55, మధిరలో 7, సత్తుపల్లిలో 14, వైరాలో ఆరుగురు మొత్తం 82మంది ట్రాంజెండర్లును గుర్తించారు. ఖమ్మంలో 55మంది ట్రాంజెండర్లు ఉండగా వారితో ఆర్ధనారీశ్వర, విశ్వం పేర్లతో రెండు ఎస్‌హెచ్‌జీ సంఘాలుగా ఏర్పాటు చేసి ఒక్కో సంఘానికి రూ.3లక్షల చొప్పున రూ.6లక్షల బ్యాంకు రుణాలను అందించారు. సంతోషి పేరుతో మూడో సంఘాన్ని కూడా ఏర్పాటు చేశారు. సత్తుపల్లిలో 10మందితో మాతా సంఘాన్ని ఏర్పాటు చేసి రూ.7లక్షలు రుణమిచ్చి డెయిరీ ఫామ్‌ను ఏర్పాటు చేయించారు.



ప్రోక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాద్రి రామయ్యకు

పట్టాభిషేకం

భద్రాచలం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామికి శనివారం పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల పుష్యమి నక్షత్రం రోజునస్వామి వారికి పట్టాభిషేకం నిర్వహించడం అనాధిగా వస్తున్న సంప్రదాయం. అందులో భాగంగా తొలుత స్వామివారికి నిత్య కల్యాణం నిర్వహించి అనంతరం పట్టాభిషేక కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, కలశవాహన, శ్రీమద్రామాయణంలో పట్టాభిషేక ఘట్టం ప్రవచనాన్ని దేవస్థానం రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు చేశారు. తరువాత కిరీటధారణ, ప్రోక్షణ, ప్రత్యేక ప్రసాద నివేదన చేసి భక్తులకు ప్రసాద పంపిణీ చేశారు.

అలాగే నిత్య కల్యాణ మండపంలో శ్రీసీతారామచంద్రస్వామి వారికి నిత్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకుడు కోటి రామస్వరూప్ రాఘవాచార్య, ముఖ్య అర్చకుడు అమరవాది మధుసూదనాచార్యులు పాల్గొన్నారు. అదేవిధంగా అంతరాలయంలో స్వామి వారికి ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించారు. ఇదిలా ఉండగా ఏపీలోని కాకినాడలోని గాంధీనగర్‌కు చెందిన శ్రీసత్యఅనురాధ స్వామివారి అన్నదానానికి రూ.1,01,116లు విరాళంగా అందించారు.



శుక్రవారం రాత్రి బయలుదేరిన ప్రయాణికులు

భద్రాచలం నుంచి

తీర్థ యాత్రలకు ప్రత్యేక బస్సులు

భద్రాచలం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తీర్థ యాత్రలకు మంచి స్పందన రావడంతో ప్రతివారం బస్సు నడపాలని భద్రాచలం ఆర్టీసీ డిపో అధికారులు నిర్ణయించారు. శుక్రవారం రాత్రి అన్నవరం, యాదగిరిగుట్ట తీర్థయాత్రలకు బస్సులు బయలుదేరి వెళ్లాయి. అలాగే మరో యాత్ర బస్సు జూలై 4న శుక్రవారం రాత్రి 9 గంటలకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని అన్నారు. యాదగిరిగుట్ట, స్వర్ణగిరి, వేయి స్తంభాల గుడి, భద్రకాళి ఆలయం, రామప్ప ఆలయం దర్శింపజేసి ఐదో తేదీ శనివారం రాత్రి 9 గంటల వరకు భద్రాచలం చేరుకుంటారని పేర్కొన్నారు. సూపర్ లగ్జరీ బస్సు టికెట్ ధర పెద్దలకు రూ.1500, పిల్లలకు రూ.760గా ఉంటుందని తెలిపారు. భద్రాచలం పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 30 మంది గ్రూపుగా ఉంటే వారు కోరుకున్న ప్రాంతానికి బస్సు నడుపుతామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9390612253, 9063414561, 9959225987లో సంప్రదించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షకుడిగా ఎదగాలి

- చిన్నారి విశ్వమిత్రను అభినందించిన కలెక్టర్ జితేష్



చిన్నారి విశ్వమిత్రను అభినందిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

చుంచుపల్లి, జూన్28(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షకుడిగా చిన్నారి విశ్వమిత్ర ఎదగాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం విద్యార్థినిని అభినందించారు. ఇటీవల డీఎఫ్‌వో కిష్టాగౌడ్‌కు గడిచిన వేసవి కాలంలో సేకరించిన వృక్షజాతికి సంబంధించిన గింజలను అందజేసినందుకు ప్రశ్నంస పత్రాన్ని అందించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కోసం చిన్నతనం నుంచే బాధ్యతగా కృషి చేస్తూ వాక్ ఫర్ ట్రీ అనే నినాదంతో అడుగులు వేస్తున్న విశ్వమిత్రను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విశ్వమిత్రతో కలిసి మొక్కను నాటారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దమ్మపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలపల్లి గ్రామ సమీపంలోని ఓ పామాయిల్ తోటలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. మందలపల్లి గ్రామానికి చెందిన అడపా వెంకటేశ్వరరావు రోజు మాదిరిగా తన తోటలోకి వెళ్లగా తోటలో మృతదేహం కనిపించడంతో వెంటనే ఈవిషయాన్ని గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 35పైగా ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జీఆర్పీ పోలీసుల పరిధిలోని నగరంలోని సారధీనగర్ మామిళ్లగుడెం అండర్ బ్రిడ్జ్ దగ్గర శనివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి (65) రైలు కిందపడి మృతిచెందాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేవని పోలీసులు తెలిపారు. పోలీసుల సమక్షంలో అన్నం శ్రీనివాసరావు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేక బాలిక ఆత్మహత్య

తల్లాడ, జూన్28(ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉండడం ఇష్టంలేక బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన శుక్రవారం రాత్రి తల్లాడ మండలం రామానుజవరం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బాలిక అయిలూరి పూజిత(16) ఇంటిలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పూజితను ఖమ్మంలోని ఓ కార్పొరేట్ కళాశాల హాస్టల్‌లో ఇంటర్ ఫస్టియర్‌లో తల్లిదండ్రులు చేర్చారు. ఆదివారం పూజిత పుట్టినరోజు, పుట్టిన రోజు వేడుక తర్వాత సోమవారం పూజితను కళాశాల హాస్టల్‌కు పంపించాలని కుటుంబసభ్యులు భావించారు. దీంతో కళాశాల హాస్టల్‌కు వెళ్లడం ఇష్టంలేక బాలిక పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి కల్లూరు తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. బాలిక పూజిత తండ్రి రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు తల్లాడ ఎస్‌హెచ్‌వో చెన్నారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువులు, విత్తనాల అమ్మకాలు

పారదర్శకంగా జరగాలి

(5వ పేజీ తరువాయి)

వరిపై మొగ్గు చూపుతుండగా అధిక లాభాలను ఇచ్చే ఉద్యాన పంటలపై దృష్టిసారించాలని, ముఖ్యంగా పామాయిల్ పంట లాభదాయకమని, అంతరపంటల ద్వారా అదనపు ఆదాయం కూడా సమకూరుతుందన్నారు. అదేవిధంగా మండలంలోని కొత్తూరులో నిర్మాణంలోని ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక, మట్టి అందజేస్తున్నామని, మండలానికి ఎంతమేర అవసరమో ముందుగానే డంప్ చేసుకోవాలని, ఏఐ ద్వారా సంబంధిత తహసీల్దార్ కూపన్లు జారీచేస్తారని, ప్రతీ సోమవారం నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులకు వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయా లేదా? అని తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ కె.రాజశేఖర్, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్‌గౌడ్, వైద్య శాఖ ఈఈ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. టి.సీతారామ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, వైద్యులు బి.సురేష్‌నారాయణ్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కేబీ జ్యోత్స్న, తహసీల్దార్ సత్యనారాయణ, ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి: ఎస్పీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

అశ్వాపురం, జూన్28(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసుల సత్వరపరిష్కారానికి అధికారులు, సిబ్బంది కృషి చేయాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా మెలగాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. శనివారం అశ్వాపురం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిబ్బంది నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఆయన పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమస్యలను అడిగితెలుసుకున్నారు. పోలీస్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను తెలుసుకున్నారు. సిబ్బందికి పలుసూచనలు చేసిన ఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోలింగ్, బ్లూకోట్స్ వాహనాలతో సంచరిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. 100డయల్ రాగానే తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డి, అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణిలో పలువురు అధికారుల బదిలీ

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న పలువురు అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయినవారిలో ఇద్దరు జీఎంలు, నలుగురు అడిషనల్ జీఎంలు ఉన్నారు. కొత్తగూడెం రీజియన్ ఓఅండ్ఎం విభాగంలో పని చేస్తున్న జనరల్ మేనేజర్ నేతల కనకయ్యను ఆర్అండ్‌బీ జనరల్ మేనేజర్‌గా బదిలీ చేశారు. ఈఅండ్ఎం విభాగంలో జీఎంగా పని చేస్తున్న సీతారాంను సోలార్ జనరల్ మేనేజర్‌గా బదిలీ చేశారు. ఐఅండ్‌పీఎం విభాగంలో పని చేస్తున్న అడిషనల్ జీఎం వెంకటరమణను కొత్తగూడెం కార్పొరేట్ క్యూమ్‌కు, సీపీపీలో పని చేస్తున్న మిర్యాల శ్రీహరిని ఐఅండ్‌పీకీ ఎస్‌వోటు జీఎంగా, రామగుండంలో పని చేస్తున్న గోపాల్‌సింగ్‌ను బెల్లంపల్లి ఏరియాకు, బెల్లంపల్లి ఏరియాలో ఈఅండ్ఎం ఏజీఎంగా పని చేస్తున్న రామనాథంను కొత్తగూడెం కార్పొరేట్ జీఎంగా, హైదరాబాద్‌లోని చేస్తున్న విశ్వనాథరాజును విజయవాడలో అప్మెల్‌కు, హైదరాబాద్ ఐటీ విభాగంలో రీజియన్ పనిచేస్తున్న గురుప్రసాద్‌ను ఈఅండ్ఎం హెచ్‌వోడీగా బదిలీ చేస్తూ ఉత్తుర్వులు జారీ చేశారు.

'ఆత్మీయ భరోసా'పై ఆశలు

(5వ పేజీ తరువాయి)

ఉత్సాహం కనిపిస్తోంది. పంటలు వేసే సమయంలో సాగుకు పెట్టుబడి అందడంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి, వరినారుమడులు, కంది, పెసర, మినుము, మిర్చినారుమడులు వేశారు.

ఉమ్మడిజిల్లాలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను కూడా అమలు చేసేందుకు ప్రభుత్వ స్థాయిలో చర్యలు మొదలవడంతో జిల్లా యంత్రాంగం కూడా అందుకు అర్హులైన వారి పేర్లతో ప్రతిపాదనలు, జాబితాలు సిద్ధం చేస్తోంది. త్వరలోనే వ్యవసాయకూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సొమ్ములు ఖాతాల్లో జమయ్యే అవకాశం ఉంది.



మల్లు రవిని కలిసి లేఖను అందజేస్తున్న కొండా మురళి

వారంలోగా వివరణ ఇవ్వాలి

- క్రమశిక్షణ కమిటీ అడిగిన ప్రశ్నలపైనే ఇవ్వండి.. కొండా మురళిని ఆదేశించిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ
- 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు మురళి
- క్రమశిక్షణ కమిటీకి 6 పేజీల లేఖ.. కడియం సహా ఇతర నేతలపై ఆరోపణలు

హైదరాబాద్, వరంగల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల పరస్పర ఫిర్యాదులపై విచారణ చేపట్టిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ వారం రోజుల్లో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిని ఆదేశించింది. శనివారం గాంధీభవన్‌లో మల్లురవి అధ్యక్షతన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశమైంది. ప్రధానంగా వరంగల్ జిల్లాలోని సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులపై మురళి చేసిన వ్యాఖ్యలపై ఆయన్ను కమిటీ వివరణ కోరింది. అదేరోజు మురళి 150కి పైగా వాహనాల్లో భారీ అనుచరగణంతో గాంధీభవన్‌కు చేరుకొని ఆరుపేజీల లేఖను కమిటీ చైర్మన్ మల్లురవికి అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎమ్మెల్యేలతో తనకు ఉన్న విభేదాలు, సఖ్యతపై లేఖలో మురళి వివరించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని లేఖలో ఆరోపిస్తూ గతంలో వారిపై తాను చేసిన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. అయితే క్రమశిక్షణ కమిటీ అడిగిన అంశాలపైనే తాము వివరణ కోరుతున్నట్లు మురళికి చైర్మన్ మల్లురవి స్పష్టం చేసినట్లు తెలిసింది. జిల్లాకు చెంది న ముఖ్యనాయకులపై చేసిన ఆరోపణలకు వారం రోజుల వ్యవధిలో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాల ని మురళిని ఆయన ఆదేశించారు. అనంతరం మల్లురవి మాట్లాడుతూ.. మురళి తాను చెప్పదలచుకున్న అంశాలను లేఖ రూపంలో అందజేశారని వెల్లడించారు. తాము అడిగిన విషయాలపై వారం రోజుల్లో రాతపూర్వకంగా ఆయన వివరణ పంపితే తదుపరి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఎలాంటి ఒత్తిడులకు లొంగే ప్రసక్తి లేదన్నారు.

పార్టీ మారితే విలువలు పాటించాలి: మురళి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న తాను ఆ పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లోకి వచ్చానని కొండా మురళి చెప్పారు. కడియం శ్రీహరి కూడా తన మాదిరిగానే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారని, అయితే ఆయన తన పదవికి రాజీనామా చేస్తారా? లేదా? అనేది ఆయనే నిర్ణయించుకోవాలన్నారు. పార్టీ మారేటప్పుడు నాయకులు విలువలు పాటించాలని సూచించారు. కడియం పార్టీలోకి వచ్చాకే సమస్యలు మొదలయ్యాయని ఆరోపించారు. కొండా సురేఖకు, సీతక్కకు గ్యాప్ ఏర్పడిందని కడియం ప్రచారం చేశారన్నారు. మంత్రి పొంగులేటి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉండి, తన సతీమణి కొండా సురేఖపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నాయిని రాజేందర్‌రెడ్డిని, ఎమ్మెల్సీ సారయ్యలతో కలిసి పొంగులేటి తమ వరంగల్ తూర్పు నియోకవర్గంలో తిరుగుతున్నారని, అయినప్పటికీ వారికి తాము ఎలాంటి ఇబ్బంది కలిగించలేదని తెలిపారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయటమే తన లక్ష్యమని, సీఎం రేవంత్‌రెడ్డి అంటే అభిమానమని పేర్కొన్నారు.

అభివృద్ధి దైవకార్యం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభ లో రేవంత్ మాట్లాడారు. రాజకీయ అవకాశవాదంతో ప్రభుత్వ కార్యక్రమాలనడ్డుకునే వారిని క్షమించుకుంటు పోదామా? అని రాష్ట్ర ప్రజలను ప్రశ్నించారు. ప్రజలు తీర్పు ఇచ్చి తమకు ఐదేళ్లు పాలించే అవకాశం ఇచ్చారని, ప్రజలెన్నుకున్న ప్రభుత్వాన్ని పనులు చేయకుండా కోర్టులో లిటిగేషన్ వేసి ప్రతిపక్షాలు నగరాభివృద్ధిని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. నాలెడ్జ్ పార్క్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కి కొనసాగింపుగా గచ్చిబౌలి స్టేడి యం పక్కన 400 ఎకరాలు అభివృద్ధి చేస్తే మరో 5 లక్ష ల మందికి ఉద్యోగావకాశాలు కల్పించవచ్చని ఆశించామని తెలిపారు. అమెరికా, సింగపూర్, జపాన్, దక్షిణ కొరియాల్లో పర్యటించి దాదాపు రూ.2.25 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, సంస్థలను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తే పానకంలో పుడకలా అడ్డుకుంటున్నారని చెప్పారు. తాత్కాలికమైన ఈ అవాంతరాలతో ప్రభు త్వం వెనక్కి తగ్గదని, చట్టసభల్లో, న్యాయస్థానాల్లో కొట్లాడి అక్కడే పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు ప్రారంభించి, లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. తమ ప్రభుత్వ ప్రస్తుత ఎజెండా అభివృద్ధేనని, ఎన్నికలప్పుడు తప్ప రాజకీయాలు చేయదలచుకోలేదన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వాళ్లు ఏదో బాగు చేస్తారని నమ్మి ఆ పార్టీ నుంచి సగం మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి మోదీ మొండి చేయి ఇచ్చారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రానికి ఏం తెచ్చారో గుండెమీద చేయి వేసుకొని ఆలోచించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. "విపక్షాల పాలనలోని బెంగళూరు, చెన్నైలకు మెట్రో ప్రాజెక్టులిచ్చారు. ఏపీకి మెట్రో.. గుజరాత్ బుల్లెట్ రైలుకు 2లక్షల కోట్లు ఇచ్చారు. అహ్మదాబాద్‌కు సబర్మతి రివర్ ఫ్రంట్, ఢిల్లీకి యమునా రివర్ ఫ్రంట్, యుపీకిగంగా రివర్ ఫ్రంట్ ఇచ్చారు. తెలంగాణ మూసీ రివర్ ఫ్రంట్ అడిగితే ఇవ్వ లేదు. మెట్రో రైల్ ఇవ్వలేదు. రీజనల్ రింగ్ రోడ్డు అటకెక్కింది. ఎందుకీ వివ క్ష?" అని కిషన్‌రెడ్డిని నిలదీశారు. "భేషజాలు లేకుండా నగరాభివృద్ధి కోసం బీజేపీ నేతల వెంట వస్తానని చెప్పా. 35 సార్లు ఢిల్లీకి వచ్చా. మోదీని, అమిత్‌షాను కలిశా. నేను కలవని కేంద్ర మంత్రి లేడు. చేయని విజ్ఞాపన లేదు. రేపు వస్తున్న అమిత్ షాకు ఎయిర్ పోర్టులో స్వాగ తం పలికి మెట్రో, మూసీ రివర్ ఫ్రంట్, రీజనల్ రింగ్ రోడ్డు అడుగుతాం" అన్నారు. "ఈ 3 ఇస్తే హైదరాబాద్ ప్రపంచం తో పోటీ పడుతుం ది. న్యూయార్క్‌లోని వా ళ్లు హైదరాబాద్‌కొ చ్చి నివసిస్తాం, ఫ్యూచర్ సిటీ లో వ్యాపారం చేసుకుంటామంటామనేలా హైదరాబాద్ తయారవుతుం ది. హాలీవుడ్, బాలీవుడ్‌ను తీసుకువస్తాం. మీ వంతు సహకరించండి. మా వైపు లోపముంటే చెప్పండి, సరిదిద్దుకుంటాం. నివేదికల్లో లోపముందా? మేం కోరుతున్నది గొంతెమ్మ కోర్కెలా? చెప్పాలి" అని కేంద్రాన్ని కోరారు.

కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి కలిశా

హైదరాబాద్ 20 ఏళ్ల కిందట మెట్రోకి, 25 ఏళ్ల కింద ఔటర్ రింగ్ రోడ్డుకు, అంతర్జాతీయ విమానాశ్రయానికి పునాదులు వేసుకొని, వందేళ్ల క్రితమే మూసీ రివర్ ఫ్రంట్ కట్టుకుందని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. మెట్రో విషయంలో ఢిల్లీ తరువాత రెండో స్థానంలో ఉన్న హైదరాబాద్ ఇప్పుడు తొమ్మిదో స్థానానికి పడిపోయిందని, చిన్న చిన్న నగరాలు మెట్రో కట్టుకొని హైదరాబాద్‌ను దాటిపోతుంటే కనబడటం లేదా? అని ప్రశ్నించారు. ఢిల్లీలో కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన సహకరిస్తే నాలుగేళ్లు హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందామని విజ్ఞప్తి చేశానన్నారు. ఎవరివి రాజకీయాలు? ఎవరివి కుట్రలు? అని ప్రశ్నించారు. కోర్ అర్బన్, సెమీ అర్బన్ రీజియన్లు, రూరల్ తెలంగాణలో ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి కోసం డిసెంబరు 9 లోపు విజన్ డాక్యుమెంట్ విడుదలతో, 100 ఏళ్లకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దేశ రాజధాని ప్రజలు నివసించలేని పరిస్థితి వచ్చిందంటే ఢిల్లీలో సరైన ప్రణాళికలు లేక పోవడమే కారణమన్నారు. "వర్షాలు వస్తే చెన్నై అతలాకుతలం, ట్రాఫిక్ ఇబ్బందులతో ఎయిర్ పో ర్టుకు వెళ్లాలంటే బెంగళూరులో 6 గంటల ముందు బ యల్దేరాలి. ఇతర నగరాల నుంచిగుణపాఠాలు నేర్చుకోవాలి. న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌లతో పోటీ పడాలి" అన్నారు. కేంద్రంతో మాట్లాడి ఏడాదిలో 3,000 ఎలక్ట్రిక్ బస్సులను నగరానికి అందిస్తామన్నారు.

నాయకులకు స్ఫూర్తి పీజేఆర్

జంట నగరాలలో 20-25 యేళ్లు పీజేఆర్ శకం నడిచిందని, ఉపాధి కోసం ఎవరు నగరానికి వచ్చినా వారికి అండగా నిలబడి నిజమైన ప్రజానేతగా పని చేశారని సీఎం కొనియాడారు. ఆయన పోరాటం వల్లే నగర దాహార్తిని తీర్చేందుకు కృష్ణా, మంజీరా, సింగూరు జలాలు వచ్చాయన్నారు. హైటెక్ సిటీని మహారాష్ట్రకు తరలించే కుట్రలు జరిగినపుడు స్థానిక ఎమ్మెల్యేగా పీజేఆర్ అడ్డుకున్నారని చెప్పారు. ఏవీ కళాశాలలో తాను చదువుకొనే రోజుల్లో పక్కనే పీజేఆర్ ఇల్లు జనతా గ్యారేజీ లాగా పని చేస్తూ ఉండేదని గుర్తు చేసుకున్నారు. పీజేఆర్ వంతెనకు సమీపంలో ఆయన విగ్రహం ఏర్పాటుకు స్థలం చూడాలని ఆదేశించారు.

ఆనాడు నవ్వారు

విమానాశ్రయం అవతల లక్షల ఎకరాలు అందుబాటులో ఉన్నందునే 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ ప్లాన్ చేశామని సీఎం చె ప్పారు. ఎయిర్‌పోర్టు నుంచి మెట్రోరైల్‌తో పా టు పెద్ద హైవే కారిడార్లు నిర్మిస్తామన్నారు. 20 వేల ఎకరాలు ఓపెన్ ఏరియా, 15 వేల ఎకరాలు పార్కులతో కాలుష్యం లేని నగరం నిర్మిస్తామన్నారు. 15 వేల ఎకరాల్లో రోడ్లు, భవనాలుంటాయన్నారు. చంద్రబాబు, వైఎస్ హైటెక్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డుల అభివృద్ధికి పూనుకున్నపుడు అంతా నవ్వారని, ఈ రోజు అభివృద్ధిని మనం కళ్లారా చూస్తున్నామని అన్నారు."నాలాల అడ్డంకులు తొలగించి చెరువుల కబ్జాలకు విముక్తి కలిగిస్తున్నాం, రోడ్లు వెడల్పు చేస్తున్నాం. వంతెనలు, అండర్‌పాస్‌లు కడుతు న్నాం. అన్యాయంగా ఆక్రమించుకొని చెరువుల్లో కట్టిన నిర్మాణాలను హైడ్రాతో తొలగిస్తున్నాం" అని సీఎం రాజధానిలో ప్రభుత్వ కార్యక్రమాలను ఏకరువు పెట్టారు. నాగార్జున ఎన్ కన్వెన్షన్‌నూ తొలగించినా, తర్వాత ప్రభుత్వ మంచి కార్యక్రమాన్ని గుర్తించి ఆయనే స్వయంగా తనను కలిసి రెండెకరాలను చెరువు అభివృదికి అప్పగించారన్నారు. నగరాభివృద్ధిలో ఒక హీరోగా ముందుంటానని నాగార్జున చెప్పారని, సీఎం గుర్తు చేశారు. బతుకమ్మ కుంట కోసం వీహెచ్ పోరాడుతున్నారని, బీఆర్ఎస్ నేతలు ఆక్రమించుకుంటే హైకోర్టులో కొట్లాడి ఆరెకరాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2029 నియోజకవర్గాల పునర్విభజనలో శేరిలింగంపల్లి నాలుగైదు అసెంబ్లీ సెగ్మెంట్లుగా మారుతుందని సీఎం అన్నారు. నలుగురైదుగురు కొత్త ఎమ్మెల్యేలను తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యే గాంధీ తీసుకోవాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

ప్రపంచ ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణులు(అంకాలజిస్టు) డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం జారీ చేశారు. రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి నివారణ, ముందస్తు చికిత్స, మెరుగైన వైద్యసేవల అంశాల్లో ఆయన సహకారం తీసుకునేందుకు ప్రభుత్వం ఈ నియమాకం చేపట్టింది. డాక్టర్ దత్తాత్రేయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇటీవల స్వయంగా కలిసిన సంగతి తెలిసిందే.

దేశ ఆర్థిక వృద్ధిలో పీవీ పాత్ర కీలకం



పీవీ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క

- ప్రధాని నరేంద్ర మోదీ
- ఆర్థిక సరళీకరణతో చెరగని ముద్ర: ఖర్గే
- పీవీ సేవలు చిరస్మరణీయం: రేవంత్ రెడ్డి
- పీవీ ఇక్కడ పుట్టడం మన అదృష్టం: భట్టి
- బహుభాషా కోవిదుడు పీవీ: ఎంపీ లక్ష్మణ్
- విద్యారంగానికి ఎనలేని సేవలు: కేటీఆర్

న్యూఢిల్లీ/ హైదరాబాద్/ రాంగోపాల్‌పేట్/ భీమదేవరపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా పలువురు నేతలు ఆయనకు నివాళులర్పించారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో పీవీ చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో ఉన్న పీవీ ఘాట్ వద్ద ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పీవీ అభిమానులు పుష్పాంజలి ఘటించారు. అలాగే గాంధీభవన్‌లో, శాసనసభ లాబీలో, పీవీ పుట్టిన ఊరు వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి, స్వగ్రామం భీమదేవరపల్లి మం డలం వంగరలో పీవీ జయంతిని ఘనంగా నిర్వహించారు. నరసింహారావు దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. దేశ ఆర్థిక వృద్ధిలో నరసింహారావు పాత్ర కీలకమైనదని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ఆర్థిక, రాజకీయ పరివర్తన కీలకమైన దశలో ఉన్న దేశాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించారని తెలిపారు. ఆయన సేవలను ఎక్స్ వేదికగా మోదీ గుర్తు చేసుకున్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన పీవీకి దేశం కృతజ్ఞతలు చెబుతోందని తెలిపారు. నరసింహారావు ప్రభుత్వం అనుసరించిన విస్తృత శ్రేణి ఆర్థిక సరళీకరణ విధానాలతో దేశం అన్ని రంగాల్లోనూ గణనీయమైన వృద్ధిని సాధించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. దేశాభివృద్ధిలో ఆయనది చెరగని ముద్ర న్నారు. పీవీ సంస్కరణలతో మధ్యతరగతికి ఎంతో మేలు జరిగిందన్నారు. పీవీ బహుభాషా కోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పీవీ దూరదృష్టితో చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేశాయని గుర్తు చేశారు. పీవీ తెలంగాణలో పుట్టడం మన అదృష్టమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో అనేక సంస్కరణలకు ఆద్యుడు పీవీ అని కొనియాడారు. పీవీ మార్గాన్ని ప్రజా ప్రభుత్వం అనుసరిస్తోందని చెప్పారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. పీవీ సేవలను గుర్తిం చి ప్రధాని మోదీ ప్రభుత్వం వారికి భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు పీవీ సేవలను విస్మరించి రాజకీయంగా ఇబ్బందులకు గురిచేశాయన్నారు. ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను తెచ్చి దేశాన్ని భారీ సంక్షోభం నుంచి గట్టెక్కించిన మేధావి పీవీ నరసింహారావు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. గురుకుల విద్యాలయాలకు అంకురార్పణ చేసి విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారన్నారు.



కొణిజర్లలో సతీష్‌కు చెందిన కంటైనర్ ఇల్లు

అదరహో.. కంటైనర్ ఇల్లు

- కొణిజర్లలో ఆకట్టుకుంటున్న పోర్టబుల్ ఇల్లు
- ఖర్చు తక్కువ.. అన్ని వసతులతో సింగిల్ బెడ్‌రూమ్

కొణిజర్ల, జూన్28 (ఆంధ్రజ్యోతి): ఉండటానికి ఇల్లుకావాలి.. అది కూడా కోరుకున్నట్లు కట్టించుకోవాలి.. ఖర్చు తగ్గించుకొని, భవిష్యత్తును ఆలోచించుకొని అన్ని వసతులతో ఉన్న ఇల్లు కావాలి అనేది అతడి ఆలోచన. దానికి తగ్గట్టుగానే తక్కువ ఖర్చుతో కంటైనర్ ఇల్లును తన సొంతస్థలంలో అమర్చుకున్నారు. అది చూడటానికి చాలా ముచ్చటగా ఉందని స్థానికులు ఎగబడి చూస్తున్నారు. మండల కేంద్రమైన కొణిజర్లలో చింతల సతీష్ తన కుటుంబం కోసం ఆలోచించి సింగిల్‌బెడ్‌రూమ్ కంటైనర్‌ను తన స్థలంలో అమర్చుకున్నారు. 12 అడుగుల వెడల్పు, 30 అడుగుల లోతుతో ఉన్న కంటైనర్‌ను ముందుగానే కొలతలు ఇచ్చి తనకు కావలసిన విధంగా తయారు చేయించుకున్నారు.

హైదరాబాద్ దగ్గర తయారు..

హైదరాబాద్ సమీపంలోని దూలపల్లి వద్ద కంటైనర్ ఇంటిని తయారు చేయించారు. ముందుగానే ఇంటి బేస్‌మట్టం సిద్ధం చేసుకొని దాని కొలతలు ప్రకారం అక్కడకు వెళ్లి కొలతలు ఇచ్చి తయారు చేపించారు. కొలతలు ఇచ్చిన 20 రోజులకు కోరుకున్న విధంగా కంటైనర్ తయారైంది. దానిని తీసుకొచ్చి నిర్మించిన బేస్‌మట్టంపై అమర్చారు. సింగిల్‌బెడ్‌రూమ్‌తో తయారు చేసిన కంటైనర్ రూ. 6 లక్షలు అయిందని, ఇంటికి చేరేసరికి జీఎస్టీ, ట్రాన్స్‌పోర్టు కలిపి మరో లక్ష అయిందని మొత్తం ఏడు లక్షలతో కంటైనర్ ఇల్లు ఇంటికి చేరిన్నట్లు సతీష్ తెలిపారు.

కంటైనర్‌లో ఉన్న వసతులు..

సతీష్ ఏర్పాటు చేసిన కంటైనర్‌లో ఇల్లు నిర్మిస్తే ఎన్ని సదుపాయాలు ఏర్పాటు చేసుకోవచ్చో అన్ని వసతులు ఉన్నాయి. కంటైనర్ వారే సింగిల్ బెడ్‌రూమ్‌తో పాటు కిచెన్ డిజైన్, అద్భుతంగా ఇంటిరియల్ ఏర్పాటు, ఏసీ, గీజర్ ఏర్పాటుకు విద్యుత్, వాషింగ్‌మిషన్‌కు విద్యుత్, లోపలమొత్తం సీలింగ్, కావలసిన లైట్లు, ఫ్యాన్‌లు, అటాచ్‌బాత్‌రూం అన్ని డిజైన్‌లతో కంటైనర్‌ను ఏర్పాటు చేసి తీసుకొచ్చారు. మొదటిసారిగా కంటైనర్ ఇల్లు మండలానికి రావడంతో ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు.



కంటైనర్ ఇంట్లోని సౌకర్యాలు

ఆలోచించి చేశా: చింతల సతీష్



భవిష్యత్తులో ఇంటి స్థలం వృథాకాకూడదు. ఎక్కువ డబ్బులు ఉన్నపుడు మంచిగానే ఇల్లు కట్టుకోవాలి. ఉండటానికి మాత్రం మంచి ఇల్లు కావాలి. సుతారి ఖర్చు లు, మెటీరియల్ ఖర్చులు, నెలలు తరబడి సమయం ఈవన్నీ ఆలోచించా. కంటైనర్ ఇల్లు అయితే ఎలా ఉంటుందని ఆలోచించి వెంటనే తయారి వద్దకు వెళ్లి కొలతలు ఇచ్చి తను కోరుకున్న విధంగా తయారు చేపించుకున్నా.

గంజాయి కేసులో.. సమాచార సేకరణ పూర్తి?

- ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించిన నిఘా వర్గాలు
- సత్తుపల్లి వాసుల్లో ఉత్కంఠ రేపుతున్న కేసు
- ఏ స్థాయిలో చర్యలుంటాయనే దానిపై విస్తృత చర్చ



సత్తుపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గతేడాది సత్తుపల్లిలో నమోదైన గంజాయి కేసు విషయమై పెద్ద మొత్తంలో వసూళ్లు జరిగాయనే ఆరోపణలకు సంబంధించి నిఘా వర్గాలు చేపట్టిన సమాచార సేకరణ ప్రక్రియ ముగిసినట్టు సమాచారం. దీనికి సంబంధించి నివేదిక ఉన్నతాధికారులకు అందిందని తెలుస్తుండగా.. దీనిపై మున్ముందు ఏం జరగబోతోందనే దానిపై ఇప్పుడు సత్తుపల్లిలో ప్రధాన చర్చ జరుగుతోంది. నిఘా వర్గాలు రంగంలోకి దిగి విచారణ జరుపుతున్న క్రమాన్ని వివరిస్తూ.. ఈ నెల 21న 'సత్తుపల్లిలో గంజాయి కేసు కలకలం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. గతేడాది అక్టోబరులో గంజాయి వినియోగం, విక్రయం చేస్తున్నారంటూ సత్తుపల్లి పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆంధ్రా నుంచి గంజాయి కొనుగోలు చేసి కొందరు సేవించినట్లు, కొందరు ఖర్చుల కోసం గంజాయిని విక్రయిస్తున్నారని నిర్ధారించుకున్న పోలీసులు నాడు 11 మందిని అరెస్టు చేశారు. ఆ తర్వాత జరిపిన విచారణలో 82మందిని గుర్తించారు. వీరిలో మైనర్లు కూడా ఉన్నారని సమాచారం. వీరందరికీ కౌన్సెలింగ్ నిర్వహించి పంపారు. 11 మందిని అరెస్టు చేసి కౌన్సెలింగ్ ఇవ్వడంతో మిగిలిన వారు తమ పిల్లలపై కేసు లేదని భావించారు. కానీ ఇప్పుడు వారందరికీ నోటీసులు జారీ కావడంతో.. తమ పిల్లలపై కేసు ఉందని తమకు మాట మాత్రంగా కూడా అప్పట్లో చెప్పలేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

వసూళ్లు జరిగాయని ఆరోపణలు

అప్పట్లో ఈ కేసులో సత్తుపల్లి పట్టణంలోని పలువురు ప్రముఖుల పిల్లలు కూడా ఉన్నారని ప్రచారం జరిగింది. ఈ క్రమంలో కేసు లేకుండా బయటపడేందుకు కొందరు రూ.లక్షల్లో ముట్టజెప్పారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆరోపణలు, ఫిర్యాదులు ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో ఇటీవల నిఘావర్గాలను రంగంలోకి దింపగా వారు వసూళ్లకు సంబంధించి సమాచారం సేకరించినట్టు తెలిసింది. నివేదికను కూడా ప్రభుత్వానికి అందజేసినట్టు సమాచారం.

సర్వత్రా ఇదే చర్చ

సత్తుపల్లి పట్టణంలో ఎక్కడ విన్నా గంజాయి కేసుపైనే చర్చ నడుస్తోంది. సాధారణ ప్రజల నుంచి రాజకీయ ప్రముఖుల వరకూ ఎవరి నోట విన్నా ఇదే వినిపిస్తోంది. పట్టణంలో ఎవరెవరు ఎంతెంత ముట్టజెప్పారనే విషయంపై బహిరంగంగానే పేర్లతో సహా చర్చించుకుంటున్నారు. రూ.లక్షల్లో చేతులు మారినట్టు ప్రచారం జరుగుతుండటంతో వసూళ్లలో ప్రైవేటు వ్యక్తులు, రాజకీయ నాయకుల పాత్ర ఏమైనా ఉందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా ఈ ఎపిసోడ్‌లో ఎవరిపై చర్యలు ఉంటాయనే దానిపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది.

అయ్యగారిపేటలో సమావేశం....

గతంలో గంజాయి కేసుకు సంబంధించి కౌన్సెలింగ్‌కు హాజరైన వారిలో కొందరి బంధువులు ఇటీవల అయ్యగారిపేటలో సమావేశమైనట్టు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై వారు ప్రధానంగా చర్చించినట్టు వినికిడి. పరిస్థితులు చక్కబడ్డాయని అనుకుంటున్న సమయంలో మళ్లీ మొదటికొచ్చిందని పలువురు ఆక్రోశం వెళ్లగక్కినట్టు సమాచారం.

వ్యవసాయ రంగ అభివృద్ధిలో రాష్ట్రానికి ఆదర్శంగా ఉండాలి

- ఎరువుల, విత్తనాల కొరత రావద్దు
- ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలి
- ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడంలో ఖమ్మం జిల్లాను ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం వ్యవసాయ, ఉద్యానవన శాఖల పని తీరుపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. వ్యవసాయ సాగు, ఎరువులు, విత్తనాల లభ్యత, రైతు భరోసా, రైతు బీమా, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పలు అంశాలపై జిల్లా కలెక్టర్ మండలాల వారీగా చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ జిల్లాలో ఆధునిక సాగు పద్ధతులు పాటించడం, పంటల మార్పిడి విధానం అమలు వంటి కార్యక్రమాల్లో జిల్లాను రాష్ట్రంలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. ఎరువులు, విత్తనాలపై ఫిర్యాదులు రాకుండా మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 9 రోజుల వ్యవధిలో రూ. 9 వేల కోట్లను రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేసి, వ్యవసాయ రంగ ప్రాధాన్యం తెలియజేసిందని, ప్రతి మండల వ్యవసాయ అధికారి తన పరిధిలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు.

జిల్లాలో ఎరువులు, విత్తనాల స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ లో అప్ డేట్ చేయాలన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ పంట ఎక్కువ మొత్తంలో విస్తరించాలని అన్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ లక్ష్యం చేరుకోవాలని, ప్రతి క్లస్టర్ కు ఒకే రకమైన లక్ష్యాలు కాకుండా స్థానిక పరిస్థితుల కనుగుణంగా ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను నిర్దేశించాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, ఇన్‌చార్జ్ జిల్లా ఉద్యానవన అధికారి ముత్యాలు, కూసుమంచి, వైరా, ఖమ్మం అర్బన్, సత్తుపల్లి, మధిర ఏడీఏలు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, హార్టికల్చర్ అధికారి అనిత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దోస్త్ సర్టిఫికెట్ల పరిశీలన

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు గాను సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. దోస్త్ ద్వారా మొదటి, రెండో విడతలో సీట్లు పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల పరిశీలన నగరంలోని ఎస్ఆర్ బీజీ ఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకీరుల్లా తెలిపారు. ఈ సర్టిపికెట్ల పరిశీలను ఈనెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని, మూడో విడతలో సీట్లు పొందిన వారికి జూలై 1వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.

ఫ్యూచర్ సిటీ ఏవోగా మెప్మా పీడీ

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఖమ్మం మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేసి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన మహేందర్‌రెడ్డికి అరుదైన అవకాశం దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రంగారెడ్డి జిల్లాలోని ఫ్యూచర్‌సిటీ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా బాధ్యతలను కేటాయిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి కేటీఆర్ వద్ద ఓఎస్‌డీగా పనిచేసిన ఆయన అనూహ్యంగా ఖమ్మం మెప్మా పీడీగా బాధ్యతలు తీసుకొని ఆరు నెలల పాటు ఖమ్మంలో పనిచేశారు. మంచి పోస్టింగ్ కోసం మూడు నెలల క్రితం దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఇప్పుడు పూర్తిస్థాయిలో బదిలీ జరిగింది.

'ధూప, దీప, నైవేద్యానికి' 205 దరఖాస్తులు

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ధూప, దీప, నైవేద్యానికి ఖమ్మం జిల్లాలో 146, భద్రాద్రి కొత్తగుడెం జిల్లాలో 59 మొత్తం 205 దరఖాస్తులు వచ్చాయని ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ సహాయ కమిషనర్ వీరస్వామి తెలిపారు. ఈ దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం ఆదేశాలతో కమిటీని నియమించి దరఖాస్తు చేసిన ప్రతి ఆలయాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హత కలిగిన ఆలయాలకను ఎంపిక చేసి కమిషనర్ కు నివేదిక అందజేస్తామని తెలిపారు.

సకాలంలో విద్యుత్ బకాయిలు చెల్లించాలి

ఖమ్మం రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రైతులు సకాలంలో విద్యుత్ బకాయిలు చెల్లించి విద్యుత్ సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఏఈ ప్రభాకర్ సూచించారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని గుదిమల్ల గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు ఉంటే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. విద్యుత్ పరికరాలు ఉపయోగించుకునేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

శభాష్ రష్మిత !

- ఇంటర్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు
- ల్యాప్‌టాప్ బహూకరించిన కలెక్టర్ అనుదీప్



రష్మితను అభినందిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షల్లో 996 మార్కులు సాధించి, రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఇందూరి రష్మితను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అభినందించారు. ఈ విషయాన్ని జిల్లా ఎన్నారై ఫౌండేషన్ కార్యదర్శి బండి నాగేశ్వరరావు, స్థానికసంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ, నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య దృష్టికి తీసుకెళ్లారు. నగర పాలక సంస్థ కమిషనర్ చొరవతో శనివారం కలెక్టర్ తన చాంబర్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ సమక్షంలో రష్మితను ఘనంగా సన్మానించారు. విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసానికి ఉపయోగపడేందుకు రూ.70 వేల విలువ గల ల్యాప్‌టాప్‌ను కలెక్టర్ చేతుల మీదుగా బహూకరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

చాంబర్ సభ్యుడికి మాతృ వియోగం



నివాళులర్పిస్తున్న చాంబర్ అధ్యక్షుడు కృష్ణారావు

ఖమ్మం గాంధీచౌక్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): చాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ కార్యవర్గ సభ్యుడు కోల్డ్ స్టోరేజ్ శాఖ, మిర్చి శాఖ సీనియర్ సభ్యుడు పాలవరపు కోటేశ్వరరావు మాతృమూర్తి అఖిలాండేశ్వరి శనివారం కన్నుమూశారు. ఆమె మృతదేహాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షుడు సోమ నరసింహారావు(జీవై నరేష్), సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణయ్య, కోశాధ్యక్షుడు తల్లాడ రమేష్, సెంట్రల్ ఈసీ సభ్యులు పాయల నాగేశ్వరరావు, నేరెళ్ల శేషగిరిరావు, విడాల శ్రీనివాసరావు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పారిశుధ్యం పట్టాలెక్కేనా ?

- 15నెలల కాలంలో మూడో ఏఎంసీ బాధ్యతలు
- స్థానికంగా లేక పోవడమే ప్రధాన లోపం
- ఏఎంసీగా బాధ్యతలు స్వీకరించిన అనిల్

ఖమ్మం కార్పొరేషన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో తనకంటూ రాష్ట్రంలోనే తొలి వరసలో ఉండే ఖమ్మం నగరం పారిశుధ్య నిర్వహణలో మాత్రం వెనకబాటుకు గురవుతోంది. కేవలం 15నెలల కాలంలోనే మూడో అసిస్టెంట్ కమిషనర్ బాధ్యతలు స్వీకరించారు. కేఎంసీకి ఏఎంసీలు(అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్) గండం ఏర్పడినట్లు ప్రచారం జరుగుతోంది. ఖమ్మం నగర పాలక సంస్థలో అసిస్టెంట్ కమిషనర్లుగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు స్థానికంగా నివాసం ఉండకుండా వారి పూర్వ నివాస పట్టణాల నుంచి రాకపోకలు సాగిస్తుండటం ఇందుకు కారణంగా కనిపిస్తోంది. ఏఎంసీతో పాటుగా పారిశుధ్య పర్యవేక్షకులు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు సైతం ఇతర పట్టణాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వారాంతంలో ఖమ్మం నగరాన్ని మరింత శుభ్రం చేయించాల్సిన అధికారులు స్వస్థలాలకు వెళ్లటం కేఎంసీ పారిశుధ్య విభాగానికి శాపంగా మారింది.

నగరంలో ఖాళీ స్థలాలు పెద్ద సమస్యగా మారాయి. వారంలో రెండు రోజులు ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించినా అమలు కావటం లేదు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే ఖాళీ స్థలాల్లో వరద నీరు చేరుతోంది. చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. ఖాళీ స్థలాల్లో సమీప నివాసాల ప్రజలు వ్యర్థాలను, చెట్ల కొమ్మలను పడవేయటంతో చిన్నపాటి డంపింగ్‌యార్డులను తలపిస్తున్నాయి. వర్షాకాలంలో దోమలకు నివాసాలుగా ఖాళీ స్థలాలు మారుతున్నాయి.

వీటితో పాటుగా పారిశుధ్య విభాగంలో జవాన్ల నుంచి పై స్థాయిలోని పారిశుధ్య పర్యవేక్షకుల వరకు అవినీతి ఆరోపణలు వ్యాపిస్తున్నాయి. డ్రెయినేజీలు శుభ్రం చేసే పారిశుధ్య కార్మికుల నుంచి కూడా కొంత మంది జవాన్లు డబ్బులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు వ్యాపిస్తున్నాయి. అలాగే డీజిల్ ఓచర్ల పంపిణీ సందర్భంగా వాహనాల డ్రైవర్ల నుంచి శానిటరీ ఇన్స్‌పెక్టర్లు డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. 15నెలల కాలంలో మూడో ఏఎంసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న అనిల్ స్థానికంగా ఉండి పారిశుధ్య వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్త

డిగ్రీ ఫలితాల్లో మెరిసిన నేలకొండపల్లి విద్యార్థులు

నేలకొండపల్లి, జూన్28 (ఆంధ్రజ్యోతి): కాకతీయ విశ్వవిద్యాలయం మే నెలలో నిర్వహించిన డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాల్లో నేలకొండపల్లి మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ. పరంజ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

డిగ్రీలో మూడు సంవత్సరాలు కలిపి సీజీపీఏ(క్యుములేటెడ్ గ్రేడ్ పాయింట్ యారేజ్)లో బీఎస్సీలో(బీజెడ్సీలో) భూక్యా వెన్నెల8.10, బీఏలో తేజావత్ నవ్య 7.64, బీఎస్సీ(ఎంపీసీఎస్)లో కల్లూరి ఈశ్వరాచారి, 7.54, బీకాంలో మర్రి అఖిల 7.10 పాయింట్లు సాధించారన్నారు. తృతీయ సంవత్సరం ఆరో సెమిస్టర్ బీఎస్సీ(బీజెడ్సీ లో) కందికొండ సాయిహితేష్, 8.48, బీకామ్‌లో గుగులోతు నితీష 7.57 పాయింట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ పరంజ్యోతి చెప్పా రు. మంచి పాయింట్లు సాధించి కాలేజీకి పేరు తెచ్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఇద్దరు ఏసీపీల నియామకం

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 44మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసిన డీజీపీ డాక్టర్. జి. జితేందర్. దీనిలో భాగంగా ఖమ్మంలో ఖాళీగా ఉన్న రెండు ఏసీపీల పోస్టులను భర్తీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మం స్పెషల్ బ్రాంచ్ అండ్ సెక్యూరిటీ ఏసీపీగా వెయిటింగ్‌లో ఉన్న టి. మహేష్‌ను, టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా వెయిటింగ్‌లో ఉన్న టి. సత్యనారాయణను నియమించారు. ఇటీవల జరిగిన బదిలీలలో రెండు పోస్టులు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా రవి ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బదిలీ అయిన వారు వారి స్థానాలలో తక్షణమే బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు.

నేడు సీపీఐ మహాసభ

నేలకొండపల్లి, జూన్28 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) మండల 17వ మహాసభ ఆదివారం ఉదయం 11గంటలకు మూటాపురంలోని బీకేఆర్ గార్డెన్స్ లో నిర్వహించనున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి కర్నాటి భానుప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతారన్నారు. మహాసభలో పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు చెప్పారు.

క్లినికల్ శిక్షణకు దరఖాస్తులు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఎమ్మెల్టీ, ఒకేషనల్ కోర్సులలో(ఫిమేల్) 2020 మార్చి నుంచి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒక సంవత్సరం క్లినికల్ శిక్షణకు జూలై 11వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె. రవిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

1న ఎల్‌హెచ్‌పీఎస్ ఆవిర్భావ సభ

ఖమ్మం చర్చికాంపౌండ్, జూన్28 (ఆంధ్రజ్యోతి): లంబాడీ హక్కుల పోరాట సమితి నంగారభేరి(ఎల్‌హెచ్‌పీఎస్) ఆవిర్భావ దినోత్సవ సభ జూలై 1న ఖమ్మంలో నిర్వహిస్తున్నట్టు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భద్రునాయక్, వీరనారీమణుల ఆశయసాధన సమితి జిల్లా అధ్యక్షురాలు ఉపేంద్రాబాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు సినీ సంగీత విభావరి

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్వరసదా మ్యూజిక్ యూనిట్ ఖమ్మం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో సాయంత్రం సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కిక్కిరిసిన శ్రీవారి ఆలయం

- అభయ వేంకటేశ్వర్వస్వామి ఆలయానికి భారీగా భక్తులు
- అన్నప్రసాద వితరణ చేసిన ఆలయ వర్గాలు

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని 4వ డివిజన్ పరిధిలో అభయ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భూదేవి, శ్రీదేవి సహిత వేంకటేశ్వరస్వామి కొలువైన ప్రాంతంగా అభయ వెంకటేశ్వర నగర్ వర్ధిల్లుతోంది. ప్రతి శనివారం ఆలయ ప్రధాన అర్చకుడు నరగిరినాథుని. రామాచార్యుల ఆధ్వర్యంలో స్వామి శాంతి కల్యాణం నిర్వహిస్తుంటారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తారు. కాగా శనివారం భారీగా భక్తులు ఆలయానికి రావటంతో ఆలయ ప్రాంగణం నమో వెంకటేశాయ అనే నామస్మరణతో మారుమోగింది. సుమారు 1200 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేసినట్లు ఆలయ అధ్యక్షుడు బొల్లి కొమరయ్య తెలిపారు.



స్వామివారి ఆలయంలో భక్తులు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



రిటైలింగ్ వాల్ పనులను పరిశీలిస్తున్న నాయకులు

మున్నేరు నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు

ఖమ్మం మార్కెట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణంతో భూములు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుంటే ఆందోళన చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు హెచ్చరించారు. శనివారం నగరంలోని 29, 30 డివిజన్లలో మున్నేరు నిర్వాసితులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం భూములు తీసుకొని నష్ట పరిహారం ఇవ్వకుండా పనులు చేపట్టడంపై ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ఈకార్యక్రమంలో నాయకులు అల్లిక అంజయ్య, దార్ల మల్లీశ్వరి, ఆర్‌వీఎస్ యాదవ్, శ్రీకాంత్, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా పేదలకు ఆర్థిక తోడ్పాటు

- మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్ రెడ్డి

ఖమ్మం రూరల్/ తిరుమలాయపాలెం/ కూసుమంచి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన నిర్వాకం కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా వాటిని సరిచేసుకుంటూ ఇందిరమ్మ ప్రభుత్వం పేదలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తోందని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్ రెడ్డి అన్నారు. పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్, ఏదులాపురం మున్సిపాలిటీ, కూసుమంచి తిరుమలాయపాలెం మండలాలకు సంబంధించిన లబ్ధిదారులకు క్యాంపు కార్యాలయంలో శనివారం సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ఖజానాలో సరిపడా డబ్బులు లేకపోయినా అనేక ఇబ్బందులు పడుతూనే ప్రజా సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. మంత్రి పొంగులేటి హయాంలో పాలేరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకు వెళుతుందని అన్నారు. అందులో భాగంగానే తాజాగా తిరుమలాయపాలెం మండలానికి మంత్రి చొరవతో నూతన ఐటీఐ కళాశాల (ఏటీసీ సెంటర్) మంజూరైందన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలానికి చెందిన 72 మందికి రూ. 21 లక్షలు, తిరుమలాయాపాలెం మండలానికి 70 మందికి రూ.24 లక్షలు, కూసుమంచికి 79 మందికి రూ.25 లక్షలు మంజూరైయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి జగదీష్, తమ్మినేని నవీన్, మద్ది మల్లారెడ్డి, తృకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, మాజీ వైస్ ఎంపీపీ బుద్ధ వంశీకృష్ణ, ఏఎంసీ వైస్‌చైర్మన్ వనవాసం నరేందర్‌రెడ్డి, ఉన్నం రాజశేఖర్, తాటికొండ కిరణ్, కృష్ణ పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు తీసుకున్న లబ్ధిదారులతో కాంగ్రెస్ నాయకులు

కలెక్టర్‌ను కలిసిన వైరా ఎమ్మెల్యే

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని శనివారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాసు నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పూల మొక్క అందించారు. వైరా నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పలు ప్రతిపాదనలను ఆయన అందించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు వైరా నియోజకవర్గ నాయకులు ఉన్నారు.



కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసిన వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

హాస్టళ్లను పట్టించుకోని అధికారులు

- ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతిగృహాల్లోని విద్యార్థులను అధికారులు పట్టించుకోవటం లేదని, విద్యా సంవత్సరం ప్రారంభంలోని అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల రామకృష్ణ విమర్శించారు. శనివారం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన సంఘం జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు సౌకర్యాలను కల్పించకుండానే వసతిగృహాలను ప్రారంభించారని, విద్యార్థులు వచ్చిన తర్వాత కూడా వారి సమస్యలపై పరిశీలన జరపలేదన్నారు. కనీసం దుస్తులు, పుస్తకాలు, నోట్ బుక్స్, బెడ్ సీట్లు, ప్లేట్లు, గ్లాసులు, ట్రంక్ పెట్టలు ఇవ్వలేదన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాల్లో విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ విద్యాభ్యాసం చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో శివ, వంశీ, గోపీ, రాహుల్, ప్రభాస్, నవీన్, నరేశ్, వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ



మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ హన్మంతరావు

హమాలీ చార్జీలు పెంచాలి

ఖమ్మం మార్కెట్ జూన్ 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలు, స్వీపర్, రెల్లుడు కూలీలు, దడవాయిలకు హమాలీ చార్జీలు పెంచాలని మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావుకు రైతు సంఘాలు విజ్ఞప్తి చేశాయి. శనివారం మార్కెట్ కార్యాలయంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. మార్కెట్‌లో అనాది నుంచి రెండు సంవత్సరాలకు ఒక సారి కూలీ ధరలు సవరణ చేసే విధానం ఉందని ఈ ఏడాది సైతం కూలీ పెంచాలని కోరారు. ఈ సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారెడ్డి, సెక్రెటరీ మెంతుల శ్రీశైలం, దిగుమతి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు దిరిశాల వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్‌రావు, రైతు సంఘాల నుంచి అడపా రామకోటయ్య, మాదినేని రమేష్, దొండపాటి రమేష్, మీరా,నాగేశ్వరరావు, శేఖర్‌గౌడ్, రవీందర్, యుగందర్ తదితరులు ఉన్నారు.

ఆరు గ్యారంటీలను అమలుచేయాలి

తిరుమలాయపాలెం, జూన్28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు అమలుచేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పిండిప్రోలులో రాయల వెంకటనారాయణ స్మారకభవనంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం పుసులూరి గిరిబాబు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పేదలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, కుర్చీల వితరణ

- ఔదార్యం చాటిన నెల్లూరి లీలాప్రసాద్, కల్యాణి దంపతులు



విద్యార్థులకు బ్యాగులను అందజేస్తున్న లీలాప్రసాద్, కల్యాణి దంపతులు

నేలకొండపల్లి, జూన్28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మండ్రాజుపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు బ్యాగులు, కుర్చీలను మండ్రాజుపల్లి మాజీ సర్పంచ్ నెల్లూరి కల్యాణి, సీడీసీ మాజీ చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్ దంపతులు శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు తన మనవరాలి జన్మదినాన్ని పురస్కరించుకుని రూ.20వేల విలువైన బ్యాగులు, కుర్చీలను అందచేసినట్లు లీలాప్రసాద్ చెప్పారు. పాఠశాల విద్యార్థులకు కుర్చీలు, బ్యాగులను అందచేసిన కల్యాణి, లీలాప్రసాద్ దంపతులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తొర్తి గురువయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లీలాప్రసాద్ మాట్లాడారు. చిన్నారులు బాగా చదువుకోవాలని అన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినప్పుడే రాణించగలుగుతారని అన్నారు. ప్రతీ ఒక్కరు భవిష్యత్తులో తాము ఏమి కావాలనుకుంటున్నారో ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. దానికి అనుగుణంగా ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంతో పాటుగా ఉపాధ్యాయులు నాగులక్ష్మీరా, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సుజాత, నవ్య పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ

- డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మం సంక్షేమ విభాగం/ ఖమ్మం లీగల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): భారతదేశం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సమయంలో సంస్కరణలు అమలులోకి తీసుకొచ్చి, ప్రపంచంలోనే తిరుగులేని శక్తిగా దేశాన్ని నిలపటంలో దివంగత, మాజీ ప్రధాన మంత్రి పీవీ నర్సింహారావు విశేషమైన కృషి చేశారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పీవీ నర్సింహారావు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ప్రధాన మంత్రిగా, ఉమ్మడి తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రిగా పీవీ నర్సింహారావు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ, ఆర్థిక సంస్కరణలపై వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాపర్తి శరత్‌కుమార్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు దొబ్బల సౌజన్య, మెక్కా శేఖర్‌గౌడ్, నాయకులు గజ్జల వెంకన్న, కన్నెం కృష్ణప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

● మాజీ ప్రధాని, బహుభాషా కోవిదుడు పాములపర్తి వెంకట నరసింహారావు జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మమత రోడ్‌లోని పీవీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దేశ ప్రధానిగా చేసిన సేవలను కొనియాడారు. చిలకపాటి హనుమంతరావు, వెన్ను శ్రీహరిరావు, సుదర్శన్, రమేష్, వెంకటేశ్వర్లు, ఖమ్మం ఐ బ్యాంక్ సభ్యులు పాల్గొన్నారు.



నర్సింహారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

250 గ్రాముల గంజాయి స్వాధీనం

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీలో 250 గ్రాముల గంజాయి, రూ.10వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఖమ్మం 1వ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం సమాచారం మేరకు ఖమ్మం నిజాంపేటకు చెందిన వినీత్, హేమంత్‌సాయి, మరో ఇద్దరుని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. గంజాయి సేవించేందుకు అలవాటుపడిన వారు రాజమండ్రి నుంచి తెచ్చుకోవటంతోపాటు చిన్నచిన్న పొట్లాలు చేసి ఇతరులకు విక్రయిస్తున్నారని తెలిపారు. వారిని న్యాయస్థానంలో హాజరుపరిచామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విజ్ఞాన దర్శిని జిల్లా కార్యవర్గం ఎన్నిక

రఘునాథపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలోను మూఢనమ్మకాల నుంచి ప్రజలను బయటకు రప్పించేందుకు విజ్ఞాన దర్శిని శాస్త్రీయ అవగాహన కల్పిస్తుందని విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు టి. రమేశ్ పేర్కొన్నారు. సంఘం ఖమ్మం జిల్లా కమిటీని శనివారం రఘునాథపాలెంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బి. వేదన, కార్యదర్శిగా దంతేనపల్లి నాగరాజు, ఉపాధ్యక్షుడిగా బి. హనుమ, సహాయ కార్యదర్శిగా హుస్సేన్, కోశాధికారిగా బి. ప్రీతమ్ ఎన్నికైనారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లి ఆదామ్ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ జరిగినట్లు ప్రకటించారు.



విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు రమేశ్‌తో ఖమ్మం జిల్లా కార్యవర్గం



ఆంధ్రజ్యోతి

ZONE

ఆదివారం 29 జూన్ 2025

వైరా-మధిర

సత్తుపల్లి

8

WYRA, MADHIRA, SATHUPALLY

● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

పీజీ ఈసెట్‌లో మదర్‌థెరిస్సా ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన టీఎస్ పీజీ ఈసెట్-2025 ఫలితాలలో కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఫార్మసీ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభకనబరిచారు. రొట్టెల ఓంశ్రీ (574), తాటి సందీప్ (715), నీలం నోమా హరిలాన్ (828), ముత్య మణిలిఖిత (815), పింగుల ప్రేమ్‌కుమార్ (988)తోపాటు మరో ఐదుగురు 1000లోపు ర్యాంకులు పొందినట్లు ప్రిన్సిపాల్ డా.చల్లా శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఛైర్మన్ కంచర్ల సత్యనారాయణ, కరస్పాండెంట్ సాంబశివరావు, వైస్ ప్రిన్సిపాల్ డా.కుమార్ రాజా జయవరపు, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, క్లాస్ ఇంచార్జీ గంటా మానస, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలి

» లబ్ధిదారులతో కలెక్టర్ అనుదీప్

పెనుబల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు **త్వరితగతిన నిర్మించుకోవాలని,** ఇప్పటికే బేస్‌మెంట్లు పూర్తయిన ఇళ్లకు సోమవారం నుంచి నగదు చెల్లిస్తామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం మండలంలోని రామచంద్రరావుబంజర్‌లో ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని, నగదు ఎప్పటికప్పుడు అందజేస్తామన్నారు. అనంతరం పెనుబల్లి ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో సత్తుపల్లి, పెనుబల్లి మండలాలు ముందున్నాయని, బేస్‌మెంట్లు పూర్తిచేసిన ప్రతి లబ్ధిదారుడికి ప్రతి సోమవారం రూ.లక్ష ఖాతాల్లో జమచేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు ఇంకా ప్రారంభించని వారికి మండలస్థాయి అధికారులు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణం ప్రారంభించేవిధంగా ప్రోత్సహించాలని సూచించారు. వనమహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్, తహసీల్దార్ ఆర్.నారాయణమూర్తి, ఎంపీడీవో అన్నపూర్ణ, ఎంఈవో సత్యనారాయణ, పీఆర్ ఏఈ రమేష్, అధికారులు పాల్గొన్నారు.



రామచంద్రరావుబంజర్‌లో ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రభుత్వ టీచర్ల పిల్లలు సర్కారు బడుల్లో చేరిక

బోనకల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బడిబాటలో భాగంగా గ్రామాల్లో విద్యార్థుల ప్రవేశం కోసం తల్లిదండ్రులను కలిసినపుడు ఉపాధ్యాయుల పిల్లలు ఎక్కడ చదువుతున్నారని కొందరు ప్రశ్నించడం జరిగింది. అందరికి భిన్నంగా ఆదర్శంగా ఆలోచించారు ఆ మహిళా టీచర్లు. తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి అందరి మన్ననలను అందుకున్నారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించినందుకు గానూ మండలంలోని జానకీపురం కాంప్లెక్స్ పాఠశాలలో టీచర్లను శనివారం ఎంఈవో దామాల పుల్లయ్య, యూటీఎఫ్ నాయకులు అభినందించడంతోపాటు ఘనంగా సన్మానించారు. నారాయణపురం ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న గంగుల పావని తన కుమార్తె హన్షితను తాను పని చేస్తున్న బడిలో 1వ తరగతిలో చేర్చారు. అదే గ్రామంలోని ఎస్సీ కాలని ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న గంగా భవాని తన కుమారుడు యశ్వంత్‌ను జానకీపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7వ తరగతిలో చేర్పించారు. వీరు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి ఆదర్శంగా నిలిచినందుకు గానూ యూటీఎఫ్ జిల్లా, మండల నాయకులు గుగులోతు రామకృష్ణ, జి.రంగారావు, సదాబాబు, గోపాలరావు, నరేంద్ర సిన్హా, ఇంచార్జ్ హెచ్‌ఎం పద్మారాణీ, కాంతారావు, రత్నాకర్ ప్రత్యేకంగా అభినందించారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో దామాల పుల్లయ్య

విద్యుత్ సమస్యలకు చెక్

» డిప్యూటీ సీఎం భట్టి కృషితో మెరుగైన విద్యుత్ సేవలకు శ్రీకారం
» కొత్తగా మోటమర్రి విద్యుత్ సెక్షన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు
» బోనకల్ సబ్ డివిజన్ మార్పునకు కసరత్తు

బోనకల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్క తనదైన విజన్‌తో నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు ఇప్పటి వరకు విద్యుత్ సమస్యలతో అల్లాడిపోయేవారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తరువాత విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కలిగించే అంశంపై దృష్టి సారించారు. మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు శ్రీకారం చుట్టారు.

12 గ్రామాలకు అందనున్న సేవలు

మండలంలో మొత్తం 22 గ్రామాలు ఉన్నాయి. బోనకల్ విద్యుత్‌శాఖ కార్యాలయం నుంచి విద్యుత్ సేవలను అందిస్తున్నారు. కొత్తగా మండలంలోని మోటమర్రి విద్యుత్ సెక్షన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు వచ్చాయి. ఇందుకు సంబంధించి పూర్తి సమాచారాన్ని పంపేందుకు విద్యుత్‌శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. మోటమర్రి సెక్షన్ పరిధిలో 12 గ్రామాలకు విద్యుత్ సేవలు ప్రత్యేకంగా అందించనున్నారు. సెక్షన్ కార్యాలయంలో కొత్తగా ఏఈ, సబ్ ఇంజనీర్, మరి కొంతమంది సిబ్బందిని కేటాయిస్తారు. ఆళ్లపాడు, గోవిందాపురం(ఎ), రాయనపేట, కలకోట, మోటమర్రి, బ్రాహ్మణపల్లి, రావల్లి, చిన్నబీరవల్లి, పెద్దబీరవల్లి, నారాయణపురం, సీతానగరం, జానకీపురం గ్రామాలకు ఇక్కడ నుంచి విద్యుత్ సేవలు అందుతాయి. ఈ పరిధిలో 340 ట్రాన్స్‌ఫార్మర్లు, 8,200 విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. ఇక బోనకల్ సెక్షన్ పరిధిలో 10 గ్రామాలకు విద్యుత్ సేవలు అందుతాయి. బోనకల్, రావినూతల, చిరునోముల, ముష్టికుంట్ల, చొప్పకట్లపాలెం, గార్లపాడు, రామాపురం, గోవిందాపురం(ఎల్), లక్ష్మీపురం, తూటికుంట్ల గ్రామాలకు సంబంధించి 11,500 విద్యుత్ సర్వీసులు, 360 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి.

బోనకల్ కేంద్రంగా కొత్తగా సబ్ డివిజన్ ఏర్పాటు చేసేందుకు కూడా కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. కొత్తగా బోనకల్ విద్యుత్ సబ్ డివిజన్ ఏర్పాటు జరిగితే ఇక్కడికి ఏడీ ఈ, సబ్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు వస్తాయి. సాధ్యమైనంత తొందరలోనే ఇందుకు సంబంధించిన విధానాలను పూర్తి చేస్తారని సమాచారం. ప్రస్తుతం మండలంలో సీతానగరం, రావినూతల, మోటమర్రి గ్రామాలలో విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి. వీటికి తోడు కొత్తగా మరో మూడు గ్రామాలైన చిరునోముల, బ్రాహ్మణపల్లి, లక్ష్మీపురానికి విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరయ్యాయి. సర్వీసులను విభజించి ఎక్కువ లోడ్ పడకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు సకాలంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో కొత్త విధానాలు దోహదపడనున్నాయి. పర్యవేక్షణ పెరగడంతోపాటు పూర్తి స్థాయిలో సిబ్బంది మెరుగైన సేవలందించేందుకు గానూ అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. విద్యుత్ శాఖ మంత్రిగా భట్టి ఉండడంతో విద్యుత్ కష్టాలు ఉండబోవని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న ఆయనను ప్రజలు అభినందిస్తున్నారు.



నూతన సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

కలెక్టర్‌ను కలిసిన వైరా ఎమ్మెల్యే



కలెక్టర్‌కు పూలమొక్క అందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఖమ్మం కలెక్టరేట్/వైరా జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని శనివారం వైరా శాసనసభ్యులు మాలోతు రాందాసు నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్క అందించారు. వైరా నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పలు ప్రతిపాదనలను కలెక్టర్‌కు అందించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా, కొణిజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ, వైరా పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నాయకులు సూరంపల్లి రామారావు, దొడ్డా పుల్లయ్య, మట్టూరి వెంకటేశ్వరరావు, బోళ్ల గంగారావు, కోసూరి శ్రీను, పమ్మి అశోక్, షేక్.సైదా, జాన్‌పాషా, తోటకూర గోపి, మురళీ, బాలు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ జయంతి వేడుకలు

మధిర రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ పీవీ.నర్సింహారావు 104వ జయంతి వేడుకలను శనివారం మధిర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ.నర్సింహారావు చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశాభివృద్ధికి పీవీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ బండారు నర్సింహారావు, నాయకులు సూరంశెట్టి కిషోర్, కర్నాటి రామారావు, అద్దంకి రవికుమార్, దుంపా వెంకటేశ్వర్‌రెడ్డి, బొమ్మకంటి హరిబాబు పాల్గొన్నారు.

నర్సరీలను సరిగా నిర్వహించాలి

ఏన్కూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నర్సరీలను సమర్థవంతంగా నిర్వహించాలని ఉపాధి హామీ ఏపీడీ చలపతిరావు సిబ్బందిని ఆదేశించారు. శనివారం నూకాలంపాడు, జన్నారం ఎస్టీకాలనీ, టీఎల్ పేట నర్సరీలను పరిశీలించారు. నాటిన ప్రతి మొక్క బతికే విధంగా చర్యలు చేపట్టాలన్నారు అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులకు, ఈజీఎస్ సిబ్బందికి వనమహోత్సవంపై పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జీవీఎస్ నారాయణ, ఏపీవో సూరయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం



ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న నగేష్

పెనుబల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ పంట లాభదాయకమని, ఒక్కసారి మొక్క నాటితే 30ఏళ్ల వరకు ఆదాయాన్ని ఇచ్చే పంట అని ఉద్యానవనశాఖ అధికారి నగేష్ అన్నారు. శనివారం మండలంలోని మండాలపాడులో సోమరాజు నర్సింహారావు, వెంకటశ్యాంప్రసాద్, రామకిషన్‌కు చెందిన భూముల్లో చేపట్టిన ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోతులు, ప్రకృతి వైపరీత్యాల నుంచి హాని లేని పంట, చీడపీడలు తక్కువగా ఆశించటంతోపాటు మార్కెటింగ్ సౌకర్యం కూడా ఆయిల్‌పామ్ పంటకు ఉందన్నారు. రూ.200విలువగల మొక్కను రూ.20కే రైతులకు ఇవ్వటం జరుగుతుందని, నాలుగు సంవత్సరాల పాటు నిర్వహణ ఖర్చుల కింద ఎకరాకు సంవత్సరానికి రూ.4500అందిస్తుందని, ఆయిల్‌పామ్ పంటకు ఎస్సీ, ఎస్టీలకు 100శాతం, బీసీ, చిన్నకారు రైతులకు 90శాతం, ఇతర రైతులకు 80శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ నాగలక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.

టీటీ ఇంజక్షన్ల కొరత

ఏన్కూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీటీ ఇంజక్షన్ల కొరతతో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కుక్క, కోతి, పాము తేలుకాటుతోపాటు ప్రమాదాలు జరిగి గాయాలైనప్పుడు, టీటీ ఇంజక్షన్లు తప్పనిసరిగా చేయించుకోవాలి. కానీ ఆసుపత్రికి వచ్చే వారికి ఇంజక్షన్లు లేవని ప్రైవేటు మెడికల్ షాపులో తీసుకురావాలని సిబ్బంది చెబుతుండటంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేలో బ్రిడ్జిని వెంటనే పూర్తి చేయాలి

» ఆందోళన చేసిన రైతులు

వైరా, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా పంటపొలాలకు వెళ్లే రహదారిలోని బ్రిడ్జిని సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని సోమవరం రైతులు శనివారం గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను అడ్డుకున్నారు. సోమవరం సమీపంలోని వైరా రిజర్వాయర్ కుడి కాల్వపై గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా తమ పంట పొలాల్లోని ఉత్పత్తులను వాహనాల ద్వారా తీసుకురావడానికి అవసరమైన బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని రైతులు డిమాండ్ చేశారు. కుడి కాల్వ రెండు గట్లపైన వ్యవసాయ ఉత్పత్తులతో వాహనాలు వెళ్లి వచ్చేందుకు అవసరమైన బ్రిడ్జిని నిర్మించకుండా గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు తమను మోసం చేస్తున్నారని రైతులు ధ్వజమెత్తారు. బ్రిడ్జి నిర్మాణం కోసం గతంలో తాము ఆందోళన చేసిన సందర్భంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు ఇచ్చిన హామీని ఇంతవరకు అమలుచేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో దిగొచ్చిన గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్రిడ్జి నిర్మాణం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, రైతులు గొల్లపూడి హరినాథ్‌బాబు, జాలాది గోపాలరావు, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, కొల్లి రమేష్, గొల్లపూడి రాంబాబు, మధు, రెడ్డి పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సోమవరం రైతులు

ఇందిరమ్మ ఇళ్ల జాబితా పరిశీలన

మధిర రూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మధిర మండలంలోని మాటూరు, ఖాజీపురం, సిద్ధినేనిగూడెం గ్రామాల్లో శనివారం డీపీవో ఆశాలత పర్యటించారు. ఈ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సూపర్‌చెక్ పరిశీలనలో భాగంగా ఆమె పర్యటించారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శాస్త్రీ పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత శనివారం పర్యటించారు. గోసవీడు, రామన్నపాలెం గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల జాబితాను సమీక్షించారు. ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా సహించే ప్రసక్తేలేదని అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి పరిశీలించి వారితో మాట్లాడారు. ఇళ్లు కట్టుకోవడం పేదవారి చిరకాల కోరికని, దానిని నెరవేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ అవకాశం కలిగించిందని, రాజీ పడకుండా శ్రమించి త్వరగా ఇల్లు పూర్తి చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. నిబంధనల ప్రకారమే ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు. ఎంపీవో శ్రీలక్ష్మి, కార్యదర్శి గోపి, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఇళ్ల జాబితాను పరిశీలిస్తున్న డీపీవో ఆశాలత

విద్యార్థి దశ నుంచే న్యాయశాస్త్రంపై అవగాహన

» 6వ అదనపు జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయాధికారి మారగాని శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే కోర్టు, విధులు, న్యాయంపై అవగాహన కలిగి ఉండాలని 6వ అదనపు జిల్లా న్యాయాధికారి మారగాని శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక తెలంగాణ గురుకుల మైనార్టీ కళాశాలలో మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. బాధితులు, కక్షిదారులకు న్యాయపరమైన సహాయాన్ని అందించేందుకు అవసరమైన న్యాయ వ్యవస్థలు ఉన్నాయని, విద్యార్థులకు న్యాయ సహాయం ఎలా అందుతుందో వివరించారు. ర్యాగింగ్, ఫోక్సో యాక్ట్, తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ బీ.నాగసాయి సుమబాల, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జే.గోపాలరావు, బార్ అసోసియేషన్ సెక్రటరీ సాధు కృష్ణయ్య, ప్రిన్సిపాల్ కే.వెంకటరామయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

పెనుబల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు పేర్కొన్నారు. శనివారం పెనుబల్లిలో సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో హమాలీ యూనియన్, మిడ్డేమీల్స్ కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, వెల్పర్స్ డిమాండ్లతో కూడిన నోటీసులను వర్తక, వాణిజ్య వ్యాపారులు ఎంఈవో సత్యనారాయణ, సీడీపీవో నిర్మలజ్యోతి, సూపర్‌వైజర్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని, సమ్మెలో అసంఘటిత, ఉద్యోగ కార్మికులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు నల్లచట్టాలను తక్షణమే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. హమాలీ యూనియన్ నాయకులు మిద్దే స్వామి, రాములు, అన్నపురెడ్డి లక్ష్మయ్య, కొప్పుల కృష్ణ, నాగయ్య, మల్లెల వెంకటేశ్వరరావు, మిడ్డేమీల్స్ కార్మికసంఘం నాయకురాళ్లు ధనలక్ష్మీ, లక్ష్మీ, దుర్గా, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు కె.సుజాత, పద్మరాజకుమారి, పద్మ, కళావతి, వ్యకా.సం జిల్లా కమిటీ సభ్యుడు తిరుపతిరావు, సీఐటీయూ నాయకులు తాండ్ర రాజేశ్వరరావు, నలమల అరుణ్‌ప్రతాప్, చిట్టిమోదుల కృష్ణ, గుడిమెట్ల బాబు పాల్గొన్నారు.

వైరా, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ వైరా పట్టణ కార్యదర్శి అనుమోలు రామారావు కోరారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మె నోటీసులను శనివారం వైరా ఐఎంఎల్ డిపో మేనేజర్ నారాయణరావుకు మార్కెట్‌యార్డులో అక్కడి హమాలీలు ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్ సంధ్యకు అందజేశారు. ఆరోజు జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. హమాలీ సంఘం నాయకులు మల్లు పట్టయ్య, రవి, సైదులు, బండ్ల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.



నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆస్పత్రిని అభివృద్ధి చేయాలి

తల్లాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తల్లాడ ప్రభుత్వ ఆస్పత్రిలో 30 పడకలకు పెంచుతు అభివృద్ధి చేయాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని భారత ప్రజాతంత్ర మహిళ సమాఖ్య(ఐద్వా) ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లాడ మండలంలో 42గ్రామాలు 60వేల మంది జనాభ కలిగి ఉన్న దృష్ట్యా జనాభాకు అనుగుణంగా ఆస్పత్రి స్థాయిని 30పడకలకు పెంచి 24గంటలు వైద్యసేవలు అందించేలా అభివృద్ధి చేయాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల టెస్టులు, ఎక్స్‌రే మిషన్ వంటి సౌకర్యాలు కల్పించి సర్కారు ఆస్పత్రుల పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలిగించలన్నారు. ప్రైవేట్ వైద్య దోపిడిని అరికట్టి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లానాయకురాలు శీలం ఫకీరమ్మ, తమ్మిశెట్టి నాగమణి, పేరసాని లత పాల్గొన్నారు.



ఆస్పత్రిని సందర్శించిన ఐద్వా నాయకులు

తహసీల్ వద్ద రైతులు, విద్యార్థుల పడిగాపులు

కారేపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు, విద్యార్థులు పడిగాపులు కాస్తున్నారు. ఇటీవల భూ భారతి కింద రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. అలాగే గ్రామ సభలలో అధికారులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి వారి వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. హెల్ప్‌డెస్క్‌లో కూడా ఇవ్వనివారు తమ దరఖాస్తులను తీసుకుని కార్యాలయం వద్దకు వస్తున్నారు. ఇప్పుడు దరఖాస్తులు తీసుకోవడం కుదరదని, అందిన దరఖాస్తుల సంఖ్యను ఇప్పటికే జిల్లా అధికారులకు సమాచారం అందించడం జరిగిందన్నారు. విద్యార్థులు కులధృవీకరణ, ఆదాయ పత్రాలకోసం కార్యాలయం చుట్టు ప్రదక్షణలు చేస్తున్నారు. కార్యాలయం వద్దకు వచ్చేవారికి సంబంధించిన సహాయసహకారాలు అధికారులు అందించాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

చింతకాని, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వందనం, రామకృష్ణాపురం గ్రామాల సమీపంలోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి దానిలోని రాగి వైరును అపహరించినట్లు విద్యుత్ సంస్థ ఏఈ చావా శ్రీధర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. రేపల్లెవాడలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడం వల్ల తొమ్మిది విద్యుత్ స్తంబాలు విరిగిపోయినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఐ నాగుల్‌మీరా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన

కారేపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం మండల వైద్యులు భూక్య సురేష్ వ్యక్తగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీ సౌజన్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానంగా విద్యార్థులందరూ వ్యక్తగత పరిశుభ్రత పాటించాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు.స్వాతి, విజయ, మమత,సులోచన, సరస్వతి, చందన,దేవి కర్ను, కళ్యాణి పాల్గొన్నారు.

హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

కల్లూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): దేశ సంపదను కొద్దిమంది కార్పొరేటర్లకు అప్పగించేందుకు మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తోందని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకన్న అన్నారు. శనివారం కల్లూరులో ఏర్పాటైన విప్లవోద్యమనేత, కార్మిక నాయకుడు డివి కృష్ణ మూడవ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీవి. కృష్ణ గొప్ప ఆదర్శమూర్తని, విప్లవ భావాలు ఎక్కుఉండేవన్నారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వాలు రద్దు చేశాయని విమర్శించారు. రద్దు చేసిన కార్మిక చట్టాల స్థానంలో బీజేపీ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. పౌరహక్కుల సంఘం జిల్లా నాయకుడు కాటినేని శ్రీనివాసరావు, మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యులు, హమాలీ యూనియన్ నాయకులు పరిగడపు పిచ్చయ్య, కాకటి ముత్తయ్య, లచ్చిరామ్, మాధవరావు సరేష్ పాల్గొన్నారు.

వైరా, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ధర వ్యత్యాస చెల్లింపు పథకం(పీడీపీఎస్) ద్వారా కార్పొరేట్ చేతుల్లోకి పత్తి కొనుగోళ్లు వెళ్తాయని సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు విమర్శించారు. శనివారం మండలంలోని గన్నవరం గ్రామంలో బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల్లో వివిధ అంశాలపై వారు తరగతిలో బోధించారు. పత్తి కొనుగోళ్ల బాధ్యత నుంచి కేంద్రం తప్పుకుని కార్పొరేట్ చేతుల్లో పెడుతోందని ఆరోపించారు. సీసీఐను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. నాయకులు మేరుగు రమణ, శీలం వెంకటరెడ్డి, మాగంటి తిరుమలరావు, తూము సుధాకర్, బాజోజు రమణ, కిలారు శ్రీనివాసరావు, శరాబందీ, చిన్నసత్యనారాయణ, కొణిదెన కోటేశ్వరరావు, తుమ్మల జాన్‌పాపయ్య పాల్గొన్నారు.

'సీజనల్' పట్ల అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో కళావతీబాయి

చింతకాని, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో కళావతి బాయి సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని పాతర్లపాడు పల్లె దవాఖానాను శనివారం ఆమె సందర్శించారు. ఏఎన్‌ఎంలు వైద్య సిబ్బంది స్థానికంగా ఉండాలని ఆమె ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్య సిబ్బంది పల్లెల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వైద్యశాలలో రికార్డులు, గదులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పల్లె దవాఖానాలో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ పరిశుభ్రంగా ఉంచితే కేంద్ర ప్రభుత్వ అవార్డుకు ఎంపికయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి రామారావు, మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్, గ్రామస్థులు కాండ్ర పిచ్చయ్య, తేలుకుంట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో సాధువు మృతి

చింతకాని, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి కేరళలోని త్రిశూర్‌కు చెందిన శ్రీబిన్ కేఎస్ (38) అనే సాధువు మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. మృతుని వద్ద గోరఖ్‌పూర్ నుంచి త్రిశూర్‌కు వెళ్లే రైలు టికెట్ ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అన్నం శ్రీనివాసరావు బృందం శవపరీక్ష నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.